



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 245 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 27 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-




# మహానాడుకు సర్వం సిద్ధం

- 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడు
- 2029 ఎన్నికలకు రోడ్ మ్యాప్ ప్రకటించనున్న చంద్రబాబు
- ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్, ఫిజికల్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి' ప్రధాన ఇతివృత్తంగా తీర్మానాలు, చర్చలు
- 2029 ఎన్నికలకు రోడ్ మ్యాప్, కార్యకర్తలకు దిశానిర్దేశం
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్‌కు ఇదే తొలి మహానాడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పండుగలాంటి మహానాడుకు సర్వం సిద్ధమైంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఓ సంప్రదాయంగా, చారిత్రక అవసరంగా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్, 2026 సంవత్సరానికి సరికొత్త రీతిలో, నూతన ఉత్తేజంతో జరగనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు అమరావతి కేంద్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 'స్త్రీ శక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఈ మహానాడును తీర్చిదిద్దారు. 44 ఏళ్ల పార్టీ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను నెమరువేసుకుంటూ, వర్తమాన రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకుని, 2029 ఎన్నికల లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణకు పదునుపెట్టేందుకు ఈ వేదికను సిద్ధం చేశారు. ఈ మహానాడు వేదికగా వచ్చే ఎన్నికలకు చంద్రబాబు రోడ్ మ్యాప్ ప్రకటించనున్నారు.

**వర్చువల్, ఫిజికల్ కలయికతో వినూత్నంగా...**

ఈసారి మహానాడు నిర్వహణలో టీడీపీ వినూత్న పంథాను అనుసరిస్తోంది. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నెల్లూరులో భారీ ఎత్తున నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీనికి అనుగుణంగా, భారీ జన సమీకరణకు బదులుగా ఇంధనాన్ని మిగతా .. 2లో..

## పాక్-చైనా ప్రకటనలో
# 'కశ్మీర్' ప్రస్తావన
### తిప్పికొట్టిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్, చైనా జారీ చేసిన ఉమ్మడి ప్రకటనలో జమ్మూకశ్మీర్ ప్రస్తావనను తీసుకురావడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసింది. ఈ అంశంపై వ్యాఖ్యానించే హక్కు వేరే ఏ దేశానికీ లేదని పేర్కొంది. 'చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్' ప్రాజెక్టులు కొన్ని భారత మిగతా .. 2లో..

# దేశంలోకి చొరబాట్లు..
### అక్రమ వలసదారులపై ఉన్నతస్థాయి కమిటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పులను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గతంలో ప్రధాని మోదీ ప్రకటన ఆధారంగా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు ఒక పెద్ద సవాలుగా మారిందని పేర్కొన్నారు. కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని.. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మిగతా .. 2లో..

# ఆర్మీలో చేరితే అప్పుల బాధ తీరుస్తాం : పుతిన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉక్రెయిన్‌పై గత నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా.. సైన్యాన్ని పెంచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకుంటే, వారికి, వారి కుటుంబాలకు ఉండే మిగతా .. 2లో..

## అమెరికాకు ఇస్తారా..
# నాశనం చేస్తారా?
### ఇరాన్ యురేనియంపై ట్రంప్ పోస్ట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య శాంతిఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల్లో కీలకాంశం యురేనియం. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. "శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు మిగతా .. 2లో..

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

### ఆన్లైన్ పన్నుల వసూళ్లతో విధానంతో పారదర్శకత పెరుగుతుంది
### రాజవోలు గ్రామ పంచాయతీలో స్వయంగా ఆన్లైన్ పన్నుల విధానాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'సాంకేతికత వినియోగంతో పారదర్శకత పెరుగుతుంది. పంచాయతీ పన్నుల వసూలు ప్రక్రియ సరికొత్త మార్గంలో ముందుకు వెళ్లడం శుభపరిణామం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో మాన్యువల్ పద్ధతిలో పన్ను వసూళ్లు ఉండేవని, దీన్ని పూర్తిగా మార్చి మొత్తం ఆన్లైన్ విధానం తీసుకు వచ్చామని చెప్పారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానాన్ని ఉప ముఖ్యమంత్రివర్యులు మంగళవారం స్వయంగా పరిశీలించారు. రాజమండ్రి రూరల్ మండలం, రాజవోలు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ జరుగుతున్న పన్నుల వసూలు విధానాన్ని పరిశీలించారు. పన్నులను ఆన్లైన్లో కడుతున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంతో పని చేస్తుంది. ప్రజల నుంచి మిగతా .. 2లో..

## పవన్ కల్యాణ్‌తో
# టాలీవుడ్ నిర్మాతలు భేటీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళవారం రాజమండ్రిలో పలువురు ప్రముఖ టాలీవుడ్ నిర్మాతలు కలిశారు. పర్యటనలో భాగంగా నగరంలోని షెల్టన్ హోటల్‌లో బస చేసిన పవన్‌తో వారు సమావేశమై సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మైత్రీ మూవీ మేకర్స్ అధినేత మిగతా .. 2లో..

## టిడిపి కేంద్ర కార్యాలయంలో
# మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

- "స్త్రీ శక్తి" నినాదంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యంగా మహానాడు కొనసాగుతుంది
- పొదుపు చర్యల్లో భాగంగా మహానాడుకు మహర్దశ వచ్చింది : హోం మంత్రి అనిత



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లను హోం మంత్రి అనిత, మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఈసారి మహానాడు పండుగ హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పొదుపు చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో మహానాడును మిగతా .. 2లో..

## ప్రొద్దుటూరులో
# ఉద్రిక్తత
### పోలీసుల లాఠీఛార్జ్



**ప్రొద్దుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కుమారుడు కొండారెడ్డి భాగస్వామిగా ఉన్న ఎస్.ఎస్.షాపింగ్ మాల్ వద్ద రెండు వర్గాలు పరస్పరం రాళ్ల దాడికి పాల్పడ్డాయి. షాపింగ్ మాల్‌ను ప్రభుత్వ అనుమతులకు మిగతా .. 2లో..

## నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి
# నోటీసులు రాలేదు
### ప్రొఫెసర్ నాగేశ్వర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డీజీపీ సి.వి.ఆనంద్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు ఆయన వివరించారు. ఇటీవల మిగతా .. 2లో..

## పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో
# జమ చేయాలి
### తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అర్హులకే పింఛన్లు అందివ్వాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందాలన్నారు. ఆ సిబ్బంది వేతనాల కోసం నెలకు రూ.50 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. "ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకోను. పంచాయతీల ఆదాయాన్ని ట్రెజరీలో కాకుండా బ్యాంకులో జమ చేయాలి. దీనికోసం చట్టసవరణ చేయాలి. పింఛన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసేలా ఓటర్ ఐడీ, ఆధార్, ఎస్ఈఈపీసీ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్ చేయాలి. కొత్తగా అందించే పింఛన్లలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని సీఎం రేవంత్ ఆదేశించారు.

## ఎనికేపాడు నుండి కొల్లేరు వరకు
# బుడమేరు డ్రైన్ పూడికతీత

### 1.80 కోట్లతో వెలగలేరు రెగ్యులేటర్‌కు కొత్త గేట్లు అమర్చాం
### బుడమేరు డ్రైన్‌పై ఎనికేపాడు యూటీ పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు



**ఎనికేపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** బుడమేరు డ్రైన్‌పై ఎనికేపాడు దగ్గర యూటి సామర్థ్యాన్ని 4 వేల క్యూసెక్కుల నుండి 20 వేల క్యూసెక్కులకు పెంచుతూ, 36.1 కోట్లతో నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ ఎనికేపాడు దగ్గర జరుగుతున్న అండర్ టన్నెల్ నిర్మాణ పనులను అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించారు. మంత్రి నిమ్మల రామానాయుడు. బుడమేరు వరద ముంపు నుండి విజయవాడ నగరాన్ని కాపాడేలా ఎనికేపాడు యూటీ సామర్థ్యాన్ని 20వేల క్యూసెక్కులకు పెంచుతున్నాం అని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా వెలగలేరు రెగ్యులేటర్‌కు సంబందించిన గేట్లను ఎప్పటికప్పుడు నియంత్రించేలా 1.80 కోట్ల రూపాయలతో కొత్తగేట్లు అమర్చడం జరిగిందని స్పష్టం చేశారు. అదేవిధంగా నాడు బుడమేరు గట్టుకు పడిన 3 గండ్లను పూడ్చంతో పాటు, సిసి వాల్ నిర్మాణం కూడా పూర్తి చేశామని చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, మిగతా .. 2లో..

## రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను
# కలిసిన ఎంపీ హరీష్ బాలయోగి



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోటిపల్లి-నరసాపూర్ రైల్వే ప్రాజెక్టుపై న్యూఢిల్లీలో గౌరవనీయ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం కీలక సమావేశంగా జరిగిందన్నారు. కోనసీమ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాల్సిన ఆవశ్యకతను, ప్రాముఖ్యతను మంత్రికి వివరించారన్నారు. మంగళవారం జరిగిన చర్చలు, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు ఊతాన్ని ఇచ్చేవిధంగా ఉన్నాయని, సంవత్సరాల జాప్యం, అనిశ్చితి తర్వాత, కోటిపల్లి-నరసాపూర్ రైల్వే ప్రాజెక్టు చక్రాలు పరిగెత్తనున్నాయని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

# మహానాడుకు సర్వం సిద్ధం

ఆదా చేసే లక్ష్యంతో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు భౌతికంగా పాల్గొంటాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 1,800కు పైగా క్లస్టర్ల నుంచి వర్చువల్‌గా పాలుపంచుకుంటారు. ఈ క్లస్టర్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలోనూ పండుగ వాతావరణం ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**20 తీర్మానాలు... 2029కి రోడ్‌మ్యాప్**

రెండు రోజుల మహానాడులో మొత్తం 20 తీర్మానాలపై చర్చించి ఆమోదించనున్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినవి 10, తెలంగాణకు 4, అండమాన్‌కు 1, ఉభయ రాష్ట్రాలకు వర్తించేవి 4 ఉన్నాయి. చివరిగా అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా 2029 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని సంసిద్ధం చేసేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను ఈ మహానాడు వేదికగా ఆవిష్కరించనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయడం కూడా ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాల్లో ఒకటి.

**నాయకుల ప్రసంగాలు... లోకేష్‌పై ప్రత్యేక ఆసక్తి**

తొలి రోజు ఉదయం 9 గంటలకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి మహానాడును ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభోపన్యాసం చేస్తారు. పార్టీ ఆర్థిక వ్యవహారాల నివేదికను సమర్పించిన తర్వాత, చంద్రబాబు కార్యకర్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేస్తారు. 'స్త్రీ శక్తి', 'కార్యకర్తే అధినేత', 'పేదల సేవ' వంటి అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. రెండో రోజు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయి. 'తెలుగుజాతి విశ్వఖ్యాతి', 'అన్నదాతకు అండగా', 'విధ్వంసం నుంచి వికాసం వైపు', 'సంపద సృష్టి' వంటి పలు కీలక అంశాలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయి. చంద్రబాబు ముగింపు ఉపన్యాసంతో మహానాడుకు తెరపడుతుంది. ఈ మహానాడులో మరో ప్రత్యేక ఆకర్షణ నారా లోకేష్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన పాల్గొంటున్న తొలి మహానాడు ఇదే కావడంతో, ఆయన ప్రసంగంపై పార్టీ శ్రేణుల్లోనే కాక, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొంది. యువతకు, కార్యకర్తలకు ఆయన ఎలాంటి దిశానిర్దేశం చేస్తారనేది ఉత్కంఠగా మారింది. మొత్తంగా ఈ మహానాడు ద్వారా పార్టీలో నూతనోత్తేజం నింపి, రాబోయే రాజకీయ సవాళ్లకు పటిష్టమైన వ్యూహంతో సిద్ధం కావాలని టీడీపీ నాయకత్వం భావిస్తోంది.

# పాక్-చైనా ప్రకటనలో 'కశ్మీర్' ప్రస్తావన

భూభాగంలో ఉన్నాయని.. అక్కడ పాక్ చేసిన ఆక్రమణలను బలపరిచేందుకు ఏ దేశమైనా చేసే ప్రయత్నాలను తిరస్కరిస్తామని తెలిపింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల చైనాలో పర్యటించారు. ఆ క్రమంలో చైనా, పాకిస్థాన్‌లో ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నలకు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ దీటుగా స్పందించారు. ఈ రెండు దేశాల మధ్య సరిహద్దు జలవనరుల సహకారం అనే ప్రస్తావననూ చూశామన్నారు. ఆ రెండు దేశాల మధ్య ఎలాంటి సరిహద్దు లేనందున.. అసలు ఆ అంశమే తలెత్తదన్నారు. పాకిస్థాన్- చైనా మధ్య 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని భారత్ ఎప్పటికీ గుర్తించబోదని స్పష్టం చేశారు.

# అమెరికాకు ఇస్తారా.. నాశనం చేస్తారా?

అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలి" అని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడటం లేదని ప్రపంచానికి భరోసా ఇచ్చేందుకు సిద్ధమంటూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టార్గెట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# ప్రొద్దుటూరులో ఉద్రిక్తత

వ్యతిరేకంగా నిర్మించారంటూ ఇటీవల తెదేపా మాజీ ఇంఛార్జి ప్రవీణ్ మీడియా సమావేశంలో ఆరోపించారు. ఫైర్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీకి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ప్రవీణ్ వర్గీయులు మాల్ వద్దకు చేరుకున్నారు. ఇరు వర్గాలు పరస్పరం రాళ్లదాడికి దిగాయి. పోలీసులు లాఠీఛార్జి చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు.

# నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు

ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించి నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను తాను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకుల ఫిర్యాదులతో కాకినాడ, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఆయనపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వెళ్లారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను ఏపీ ప్రభుత్వం అప్పుడే ఖండించింది. తాజాగా ప్రొఫెసర్ నాగేశ్వర్ స్వయంగా తనకు నోటీసులు రాలేదని చెప్పడంతో ఈ వదంతులకు తెరపడినట్లయింది.

# దేశంలోకి చొరబాట్లు..

మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై సమగ్ర మూల్యాంకనం నిర్వహించడం.. మత, సామాజిక వర్గాల స్థాయుల్లో జనాభా మార్పుల సరళిని విశ్లేషించడం ఈ కమిటీ పని అని పేర్కొన్నారు. దేశంలో మారుతున్న జనాభా తీరుపై కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాట్లను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# ఆర్మీలో చేరితే అప్పుల బాధ తీరుస్తాం : పుతిన్

రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు రుణం నుంచి విముక్తి కలిగిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, మే 1వ తేదీకి ముందు రుణాలు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుందని సమాచారం. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని తాజా నిబంధనల్లో పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘకాలంగా జరుగుతోన్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో ఇటీవల కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇరువర్గాలతో కలిపి శాంతి చర్చలు జరిపినప్పటికీ.. అవి మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ తరుణంలో తన బలగాలను పెంచుకునేందుకు క్రెమ్లిన్ అనేక చర్యలు చేపడుతోంది. యుద్ధంలో పాల్గొనేవారికి భారీ మొత్తంలో నగదు చెల్లింపులు, ఉన్నత విద్య ప్రవేశాల్లో ప్రాధాన్యం సహా పలు రకాల ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రకటిస్తోంది.

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

వసూలు చేసే ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేస్తుంది. పంచాయతీలు స్వావలంబన సాధించాలంటే, ఆర్థికంగా వృద్ధి చెందాలి. స్వయంగా ఆదాయం ఆర్జించే స్థాయికి పంచాయతీలు రావాలి. ప్రతి అభివృద్ధి పనికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా సొంతంగా అభివృద్ధి చేసుకునే దశకు పంచాయతీలు రావాలి. దీనికోసం ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహిస్తోంది. నూతన విధానాలను పంచాయతీలు కూడా అందిపుచ్చుకొని, పన్నులు గ్రామ ప్రగతికి పునాదులు అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి" అన్నారు. పవన్ కళ్యాణ్ వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఉన్నారు.

**ఆవ ఛానెల్ పరిశీలన**

రాజవోలు గ్రామపంచాయతీ నుంచి తిరిగి వస్తూ పవన్ కళ్యాణ్ రాజమండ్రిలో కీలకమైన ఆవాఎల్ చానల్‌ను పరిశీలించారు. ఎస్టీపీ నుంచి వచ్చే ఈ ఛానెల్ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి ఉండటంపై పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లను పిలిచి కాలువలో వ్యర్థాలు పేరుకుపోకుండా, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో స్వచ్ఛరథాలు మాదిరిగా అర్బన్ ప్రాంతాల్లో కూడా ప్రత్యేకంగా ఏదైనా కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎందుకు పేరుకుపోతున్నాయనే విషయం మీదా, ఆ సమస్య మీద ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. దీనికి ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందుతుందని, వెంటనే ఛానల్ సరిదిద్దే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**గోదావరి పరీవాహకంలో కాలుష్య నివారణకు రూ.100 కోట్లు**

కృష్ణా, గోదావరి నదులను కాలుష్యం నుంచి రక్షించడానికి, వాటిని శుభ్రపరచడానికి మిషన్ క్లీన్ కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు చేపట్టారు. అయితే అనుకున్నంత స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని గుర్తించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నదీ జలాలు కాలుష్యం బారిన పడకుండా రూ.100 కోట్లను కేటాయిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ నిధుల ద్వారా మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా కాలువల్లో కలకవకుండా నిరోధించడానికి ఉపయోగిస్తామని శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలిపారు. నది, కాలువల్లోకి వెళ్లే మురికినీటిని శుద్ధి చేయడానికి ఎస్టీపీలను ఏర్పాటు చేయడం వంటి పనులను ఈ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు.

**వుడ్ బ్యాంక్ కోసం పంచాయతీరాజ్ - అటవీ శాఖ మధ్య అవగాహన ఒప్పందం**

వుడ్ బ్యాంక్ కింద మొక్కలు కొనుగోలు చేయడానికి పంచాయతీరాజ్ - అటవీ శాఖల అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 కోట్లను పంచాయతీరాజ్ శాఖ వారు అటవీ శాఖకు ఇస్తారు. అందుకు సంబంధించి అటవీ శాఖ కలపను త్వరగా ఇచ్చే మొక్కలను అందిస్తుంది. వాటితో పంచాయితీల్లో పల్లె వనాలు అభివృద్ధి చేస్తారు. అక్కడ వచ్చే కలపను అటవీ శాఖ కొనుగోలు చేసి వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా అటు పంచాయతీలకు ఆదాయ ఆర్జన సాధ్యమవుతుంది, ఇటు పర్యావరణం మెరుగవుతుంది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై పీసీసీఎఫ్ చలపతిరావు, పి ఆర్ ఆర్డీ కమిషనర్ కృష్ణ తేజ సంతకాలు చేశారు.

**పవన్ కల్యాణ్‌తో**

# టాలీవుడ్ నిర్మాతలు భేటీ

వై.రవిశంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ, షైన్ స్క్రీన్స్ నిర్మాత సాహు గారపాటి, కిలారి సతీష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని నిర్మాతలు పవన్ కల్యాణ్‌కు వివరించారు. థియేటర్ యాజమానులు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు మధ్య ఆదాయ పంపకాల (రెవెన్యూ షేరింగ్) విషయంలో నెలకొన్న వివాదాలతో పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. అధిక విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ వ్యయంతో చాలా థియేటర్లు మూసివేత అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకుని, పరిశ్రమకు అండగా నిలవాలని నిర్మాతలు కోరారు. సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ కోసం ప్రత్యేకంగా ఒక నూతన ఫిలిం పాలసీని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. థియేటర్లకు విద్యుత్ బిల్లులపై రాయితీలు కల్పించాలని కోరారు. నిర్మాతలు చెప్పిన సమస్యలను సానుకూలంగా విన్న పవన్ కల్యాణ్, తెలుగు సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఆయన, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ రాయితీలపై వచ్చిన ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పవన్ సానుకూల స్పందనతో త్వరలోనే తమ సమస్యలు పరిష్కారమవుతాయని టాలీవుడ్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

హైబ్రిడ్ రూపంలో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇదేనని తెలిపారు. మొదట మహానాడును నెల్లూరులో నిర్వహించాలని భావించినప్పటికీ, ఈసారి మరింత వైభవంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. లోకేష్ నాయకత్వంలో పార్టీకి అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని, టెక్నాలజీని వినియోగించి గ్రామ, నియోజకవర్గ స్థాయిలో కూడా నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా మహానాడును వీక్షించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొంటూ మహానాడును వీక్షిస్తున్నారని వెల్లడించారు. పొదుపు చర్యలతో పాటు పార్టీకి కొత్త దిశను చూపించే విధంగా మహానాడు నిర్వహిస్తున్నామని, నవశకానికి నాంది పలికే తొలి అడుగుగా ఈ మహానాడు నిలుస్తుందని హోంమంత్రి పేర్కొన్నారు. ఈసారి "స్త్రీ శక్తి" నినాదంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యంగా మహానాడు కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

ఎనికేపాడు నుండి కొల్లేరు వరకు

# బుడమేరు డ్రైన్ పూడికతీత

120 కోట్లతో 8.2 కి. మీ లైనింగ్ ప్రారంభించాం అని, డైవర్షన్ ఛానల్ మిగిలిన 2 కి. మీ లైనింగ్, 115 కోట్లతో థర్మల్ ప్లాంట్ పనులు టెండర్ దశ లో ఉన్నాయని అన్నారు. గత టిడిపి హాయాంలో చేపట్టిన ఎనికేపాడు యూటీ నుండి కొల్లేరు వరకు వెళ్ళే ఛానల్ విస్తరణ పనులను వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది అని, దీంతో కూటమి ప్రభుత్వం ఎనికేపాడు నుండి కొల్లేరు వరకు 57 కి.మీ పొడవున బుడమేరు డ్రైన్ పూడికతీత పనులు చేపట్టిందని తెలిపారు. కొల్లేరు నుండి ఉప్పుటేరు మీదుగా బుడమేరు డ్రైన్ నీరు సముద్రంలోకి పోయేలా 9 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు సైతం జరుగుతున్నాయి అని మంత్రి నిమ్మల వివరించారు. ఈ పర్యటనలో మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, కెడిసి సిఈ రాంబాబు, మరియు ఇతర ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'లేపాక్షి' ఉద్యోగులకు తీపి కబురు

**జీతాల పెంపుదలకు మంత్రి సవిత పచ్చ జెండా - మూల వేతనంపై 10 శాతానికి పైగా పెంపు**
**అమ్మకాలు పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు బొనాంజా - ఉద్యోగుల హర్షాతిరేకాలు**
**సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కు, మంత్రి సవితకు ధన్యవాదాలు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న లేపాక్షి షో రూమ్‌ల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రస్తుతం అందుతున్న మూల వేతనాలపై అదనంగా పది శాతానికి పైగా జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం లేపాక్షి ఉద్యోగులకు శుభ వార్త తెలిపారు. తాడేపల్లిని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేపాక్షి షో రూమ్ ల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిసి, పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. గడిచిన రెండేళ్ల నుంచి అమ్మకాలు పెంచినట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి సవిత స్పందిస్తూ, లేపాక్షి షో రూమ్ ల్లో 2024-25లో రూ.56.47 కోట్లు, 2025-26లో రూ.60.75 కోట్ల మేర అమ్మకాలు జరపడంపై ఆనందం వ్యక్తంచేస్తూ ఉద్యోగులను అభినందించారు. పెరిగిన అమ్మకాలను దృష్టిలో పెట్టుకుని ఆయా ఉద్యోగుల స్థాయిని బట్టి 10 శాతానికి పైగా జీతాలు పెంచుతున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రూ.80 కోట్లకు అమ్మకాలు పెంచాలని దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 19 లేపాక్షి షో రూమ్ లు ఉన్నాయన్నారు. త్వరలో రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన షో రూమ్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అన్ని లేపాక్షి షో రూమ్ లను నేటితరం అభిరుచులకు అనుగుణంగా మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. హస్త కళాకారులకు ఆర్థిక భరోసా కలిగించేలా 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్య సాధనకు బద్ధులై... లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచే బాధ్యత ఉద్యోగులదేనన్నారు. హస్త కళాకారులతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పెరిగిన అమ్మకాల నేపథ్యంలో జీతాలు పెంచినట్లు మంత్రి సవిత వెల్లడించారు. జీతాల పెంపుదలపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి సవితకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీహెచ్డీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు బీహెచ్వీఎస్ఎస్ఎన్ రాజు, మహేశ్వరరావు, బాలాజీ, భారతి, చంద్రశేఖర్, సుబ్బరావు, కిషోర్ కుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐ వినియోగం ద్వారా తక్కువ వ్యయంతో

# నాణ్యమైన వైద్య సేవలు!

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి**
**'ఆరోగ్య వ్యవస్థ-ఏఐ ఆధారిత సేవలు 'ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలోనే తొలిసారిగా 'మెడ్ టెక్ ఛాలెంజ్' విధానంలో వైద్య సేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ 'లైట్ హౌస్' స్టేట్ గా నిలిచిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఏఐ వినియోగంతో నిర్వహించే వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని, తద్వారా ఉన్నత వైద్యాన్ని వైద్యులు వెంటనే సదరు రోగులకు అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఏఐ వాడకంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలకు తక్కువ వ్యయమవుతుందని, దీనివల్ల సదరు కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు రోగులు త్వరగా అనారోగ్యాల నుంచి కోలుకోవడంవల్ల సదరు కుటుంబాల వారికి స్వాంతన చేకూరుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 రకాల వ్యాధుల భారాన్ని (అసంక్రమిత వ్యాధులు) ఏఐ ఆధారిత సేవల ద్వారా తగ్గించవచ్చునని తెలిపారు. ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచడంలో ఏఐ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు దూరదృష్టితో రాబోతున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అంచనావేస్తూ అన్ని రంగాల్లో అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే.. వికసిత్ భారత్ వికసిత్ ఆంధ్రప్రదేశ్ కల త్వరగా సాకారామవుతుందన్నారు. ఈ క్రమంలోనే వైద్య ఆరోగ్య శాఖలో మెడ్ టెక్ ఛాలెంజ్ ద్వారా రోగులకు అంకుర సంస్థలు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశాయని తెలిపారు. తక్కువ వ్యయంతో ఉత్తమ వైద్య సేవలు అందేలా అంకుర సంస్థలు ముందుకు రావాలి! మెడ్ టెక్ ఛాలెంజ్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 18 అంకుర సంస్థలు తమ రకరకాల ఎంక్వైప్మెంట్స్ ద్వారా ఆసుపత్రుల్లో రోగులకు ఈ మధ్య వైద్య సేవలు అందించాయి. వీటిలో ఉత్తమ ఫలితాలు కనబరిచిన అంకుర సంస్థలకు మంత్రి నగదు అందచేశారు. వాటికి ప్రశంస పత్రాలు కూడా ఇచ్చారు. మంగళగిరిలో మంగళవారం సాయంత్రం ఆరోగ్య వ్యవస్థలో ఏఐ సేవల సదస్సు ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీ సత్యకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏఐ వినియోగం ద్వారా వ్యవసాయం, విద్య, సామాజిక అభివృద్ధి వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పుల రానున్నాయని తెలిపారు. అయితే ఇందుకు తగ్గట్లు పటిష్టమైన కార్యాచరణ ఉండాలన్నారు. తక్కువ వ్యయంతో ఉత్తమ వైద్యాన్ని అందించేందుకు ఆంకుర సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత వైకాపా పాలనలో ఆరోగ్య రంగం పూర్తిగా దెబ్బతిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఆసుపత్రులను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నందున ఓపీ సేవల్లో 20% పెరుగుదల కనిపిశించిందన్నారు. ఐపీ, డయాగ్నస్టిక్ పరీక్షలు అనూహ్యశీగా పెరిగినట్లు తెలిపారు. అభా ఖాతాల నమోదులో దేశంలోనే ఏపీ తొలి స్థానంలో ఉందని వెల్లడించారు. స్వస్తి ది హెల్త్ కేటలిస్టు సంస్థ వ్యవస్థాపకులు శివ్ కుమార్ మాట్లాడుతూ సరికొత్త సాంకేతిక వ్యవస్థలను అందిపుచ్చుకోవడంలో ఏపీ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఇందుకు తగిన వాతావరణం రాష్ట్రంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ ఆథారిటీ (ఎన్ హెచ్ ఏ ) జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదరి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల పంపిణీ!

మెడ్ టెక్ ఛాలెంజ్ కింద 18 ఆసుపత్రుల్లో 4 కేటగిరిల్లో 18 అంకుర సంస్థలు పైలట్ ప్రాజెక్టు కింద రోగులకు సేవలు అందించాయి. ఒక్కొక్క కేటగిరిలో ప్రథమ స్థానంలో (విన్నర్) వచ్చిన సంస్థలకు మంత్రి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఏఐ పవర్డ్ డయాగ్నస్టిక్స్ కేటగిరి- సొలిసిట్ టెక్నాలజీస్, పోర్టబు ల్ పాయింట్ ఆఫ్ కేర్ డివైజస్ కేటగిరి-రెమిడియో ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, స్మార్ట్ మానిటరింగ్ అండ్ వెరియబుల్స్ కేటగిరి-కేర్ ఎన్ ఎక్స్ ఇన్నోవేషన్స్, రిమోట్ మానిటరింగ్ కేటగిరి-రీజువిన్ మెడికేర్ ఇండియాలు తొలి స్థానంలో వచ్చాయి. ఈ నాలుగు కేటగిరిల్లోనే మొదటి రన్నర్ అప్, రెండో రన్నర్ అప్ కలిపి మొత్తం 8 సంస్థల వివరాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ వెల్లడించారు. అంకుర సంస్థలు పైలట్ ప్రాజెక్ట్ కింద ఆసుపత్రుల్లో రోగులకు అందించిన సేవల వివరాలను ప్రత్యేక కమిటీ ముందు ప్రదర్శించాయి. వీటిని 'క్యాథ్' కమిటీ (కమిటీ ఫర్ అప్లయిడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్) పరిశీలించి విన్నర్, రన్నర్ అప్ కింద సదరు కంపెనీలను ఎంపికచేశాయి.

# ఎడిటర్ వాయిస్

## బీజేపీకి నో ఛాన్స్.. వారికి నిరాశేనా?

ఏపీ బీజేపీకి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి రాజ్యసభ సీట్ల విషయంలో నిరాశ తప్పదా అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తే అవును అనే లాగానే ఉన్నాయని అంటున్నారు. జూన్ 20న ఏపీలో ఏకంగా నాలుగు రాజ్య సభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎమ్మెల్యేల ద్వారా ఎన్నుకోబడే ఈ ఎంపీ సీట్లకు సంబంధించి బలాబలాలను చూస్తే మొత్తం సీట్లు కూటమి పరం అవడం ఖాయం. మరి ఇందులో కూటమి పార్టీలకు ఎవరిని ఎన్ని అంటే ఈ మధ్య దాకా జరిగిన చర్చను బట్టి చూస్తే తెలుగుదేశాని టీడీపీకి రెండు జనసేనకు ఒకటి బీజేపీకి ఒకటి అన్నది ప్రచారంగా సాగుతోంది. అయితే మారిన పరిణామాల నేపథ్యంలో జనసేనకు ఒకటి టీడీపీకి మూడు ఎంపీ సీట్లూ అన్న కొత్త చర్చ సాగుతోంది అని అంటున్నారు.

**పోటీ తీవ్రం కావడంతో:** అలా ఎందుకు అంటే ఏపీలో అతి పెద్ద పార్టీ టీడీపీ. ఆ పార్టీలో ఆశావహులు ఎంతో మంది ఉన్నారు. పైగా 2024 ఎన్నికల్లో పొత్తుల కారణంగా చాలా మంది ఎంపీలుగా పోటీ చేయలేకపోయారు. అలాగే చట్ట సభలలోకి కూడా అడుగు పెట్టలేకపోయారు. అలాగే చాలా మందికి సామాజిక ప్రాంతీయ సమతూకం పాటించేందుకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది అని అంటున్నారు. ఇక చూస్తే ఖాళీ అవుతున్న నాలుగు సీట్లలో సానా సతీష్ కి మరోసారి చాన్స్ ఇస్తారని అంటున్నారు. ఆయన రాజ్యసభకు వెళ్ళి కేవలం ఏణ్ణర్థం కాలంలోనే పదవిని కోల్పోతున్నారు కాబట్టి రెన్యూవల్ చేస్తారు అని అంటున్నారు. ఈ లెక్కన చూస్తే బీజేపీకి ఇస్తే టీడీపీకి మిగిలేది ఒక్కటే ఎంపీ సీటు. అందుకే టీడీపీ బీజేపీకి ఇవ్వకుండా ఆ రెండు సీట్లను తన వద్దనే అట్టేబెట్టుకుంటే ఆశావహులకు కొంతలో కొంత న్యాయం చేసినట్లు అవుతుందని ఆలోచిస్తోంది అని అంటున్నారు.

**బీజేపీ కోటా చూస్తే :** ఇదిలా ఉంటే బీజేపీకి ఇప్పటికే ఈపీ నుంచి రెండు రాజ్యసభ సీట్లు ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. అందులో ఒకటి తెలంగాణాకు చెందిన ఆర్ క్రిష్ణయ్యకు ఇస్తే మరొకటి గోదావరి జిల్లాలకు చెందిన పాకా వెంకట సత్యనారాయణకు ఇచ్చారు. ఇలా కేవలం రెండేళ్ళ కూటమి పాలనలోనే రెండు సార్లు బీజేపీకి అవకాశం దక్కింది కాబట్టి ఈ తడవ నో చాన్స్ అని అంటున్నారు. టీడీపీలో పొజిషన్ టైట్ గా ఉంది కాబట్టి ఈసారికి పెద్దగా అడగవద్దు అని టీడీపీ నుంచే సంకేతాలు కాషాయం పార్టీకి వెళ్తున్నాయని చెబుతున్నారు.

**వీరంతా రేసులో :** ఇక ఏపీలో బీజేపీ నుంచి రాజ్యసభకు వెళ్ళేందుకు రేసులో ఉన్న వారిలో తొలి పేరుగా ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేరు వినిపిస్తోంది. ఆయన గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. 2024లో కూడా ఆయనకు పొత్తులో భాగంగా టికెట్ ఇవ్వలేదు. ఆయనకు బీజేపీ పెద్దల మద్దతు ఉందని రాజ్యసభకు బీసీ నేతగా ఉత్తరాంధ్ర వాసిగా రప్పించాలని చూస్తున్నారు అని అంటున్నారు. అలాగే మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కూడా తీవ్ర స్థాయిలోనే రాజ్యసభకు వెళ్ళాలని ప్రయత్నాలు చేస్తున్నారు అని అంటున్నారు. ఆయన 2024 ఎన్నికల్లో రాజంపేట నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. రాజ్యసభకు వెళ్తే కేంద్ర మంత్రి చాన్స్ ఉంటుందని భావిస్తున్నారు అని అంటున్నారు. అదే విధంగా రాయలసీమకు చెందిన బలమైన సామాజిక వర్గం సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఒకరు ప్రయత్నం చేస్తున్నారు అని చెబుతున్నారు. ఆయనకు కేంద్ర పెద్దలతో మంచి పరిచయాలు ఉన్నాయని



చెబుతున్నారు. ఇక మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేరు కూడా ప్రచారంలో ఉంది. అయితే వీరితో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా బీజేపీ నేతల పేర్లు విన వస్తున్నా కూటమి నుంచి ఈసారి నో చాన్స్ అనే అంటున్నారు. చూడాలి మరి చివరి నిముషంలో కేంద్ర బీజేపీ నాయకత్వం గట్టిగా ఒత్తిడి తెస్తే సీన్ మారవచ్చేమో.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఆగి ఉన్న కార్లను వేగంగా ఢీకొన్న లారీ

### ఏడు కార్లు, నాలుగు లారీలు ధ్వంసం



**ఇందల్‌వాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ జిల్లాలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఓ లారీ బీభత్సం సృష్టించడంతో భయానక పరిస్థితి నెలకొంది. స్థానికులు, బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లాలోని ఇందల్‌వాయి మండలం చంద్రాయన్‌పల్లి పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న ఓ లారీ టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపై నిలిపారు. ఆ స్థలం పల్లపుప్రాంతం కావడంతో వెనుకనుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఇదే సమయంలో కొబ్బరి బొండాలతో వచ్చిన లారీ వీటిని తప్పించే క్రమంలో రహదారి పక్కన బోల్తాపడింది. దీన్ని గమనించిన చోదకులు ఏడు కార్లను రహదారిపై నిలిపివేశారు. అప్పుడే వెనుక నుంచి వచ్చిన ఎరువుల లారీ.. వేగాన్ని నియంత్రించలేక నిలిపి ఉంచిన కార్లను ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో అవన్నీ ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా, పలువురు స్వల్పంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 5 అంబులెన్సుల్లో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు తరలించారు.

## కారుతో ఢీకొట్టి ప్రమాదంగా చిత్రీకరించాలని ప్లాన్

### కవాడిగూడ యువకుడితో ఒప్పందం - ఆర్నెల్ల క్రితమే న్యాయవాది హత్యకు సుపారీ

### కిషన్‌సింగ్ సారథ్యంలో పథక రచన అమలు



**నాంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** భూవివాదాల్లో తలనొప్పిగా మారిన వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాది మొహిజుద్దీన్(63)ను అడ్డు తొలగించాలని ఆయన ప్రత్యర్థులు భావించారు. తమపై అనుమానం రాకుండా హత్య చేసేందుకు ఏడాదికాలంగా ఎంతోమందితో సంప్రదింపులు జరిపారు. చివరకు పథకం ప్రకారం ఆయన్ను అంతమొందించారు. హైదరాబాద్ రెడ్‌హిల్స్ శాంతినగర్‌లో ఇటీవల హత్యకు గురైన న్యాయవాది మొహిజుద్దీన్ కేసులో పోలీసులు కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ హత్య వెనుక అసలు సూత్రధారిని గుర్తించినట్లు తెలిసింది. రెండు మూడ్రోజుల్లో అతన్ని అరెస్ట్‌చేసే అవకాశం ఉంది. గతేడాది మొదట్లోనే న్యాయవాది మొహిజుద్దీన్ హత్యకు అసలు సూత్రధారి.. నగరానికి చెందిన కిషన్‌సింగ్ అలియాస్ పప్పుతో సంప్రదింపులు జరిపి.. డిసెంబరులో రూ.15 లక్షలిచ్చాడు. న్యాయవాదిని కారుతో ఢీకొట్టి సినీఫక్కీలో రోడ్డుప్రమాదంగా చిత్రీకరించాలని పథకం వేశారు. ఇందుకు కిషన్‌సింగ్‌తో పరిచయమున్న వినయ్ సహకారంతో కవాడిగూడకు చెందిన అభిజిత్‌ను ఎంచుకున్నారు. కారుతో స్టంట్స్ చేయటంలో ఇతడు నేర్పరి. సూత్రధారి నుంచి వచ్చిన రూ.15 లక్షల్లో రూ.5 లక్షలు కిషన్‌సింగ్ తీసుకున్నాడు. మిగిలిన రూ.10 లక్షలు వినయ్‌కు ఇచ్చారు. రూ.2 లక్షలతో సెకండ్‌హ్యాండ్ కారు కొన్నారు. పలుమార్లు రెక్కీ చేపట్టి.. ఆ కారుతో ఢీకొట్టడం కష్టమనే నిర్ణయానికి వచ్చారు. దాన్ని రూ.లక్షకు తాకట్టుపెట్టారు. మళ్లీ ఇటీవల డబ్బు చెల్లించి కారును బయటకు తీసుకొచ్చినట్టు సమాచారం.

**హోటల్‌లో వ్యూహరచన**

హత్యకు మూడ్రోజుల ముందు నుంచి సుపారీ ముఠాలోని నలుగురు సభ్యులు న్యాయవాది కదలికలపై నిఘా ఉంచారు. శుక్రవారం రాత్రి నారాయణగూడలోని హోటల్‌లో వీరు వ్యూహరచన చేశారు. శనివారం వేకువజామున రెడ్‌హిల్స్ శాంతినగర్‌లోని న్యాయవాది తన కారు డోరు తీసే క్రమంలో తమ కారుతో ఢీకొట్టారు. ఈ ఘటనలో రెండు వాహనాలకు నష్టం జరగకపోవటం పోలీసుల్ని విస్మయానికి గురిచేసింది. ఇదంతా సుపారీ ముఠా పనిగా అంచనాతో దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజిలో దొరికిన నిందితుల ఫొటోల ఆధారంగా కిషన్‌సింగ్, వినయ్, నాని, అభిజిత్‌లను గుర్తించారు. వినయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. అభిజిత్, నానిలు వారణాసి, కిషన్‌సింగ్.. శిర్డీ, ఔరంగాబాద్ పరిసరాల్లో దాక్కున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ ముగ్గురు పట్టుబడితే అసలు సూత్రధారితో ఉన్న లింక్‌లు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు.

## ఏసీబీకి పట్టుబడిన శామీర్‌పేట తహసీల్దార్



**శామీర్‌పేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భూ సమస్య పరిష్కారానికి రూ.2 లక్షల లంచం తీసుకుంటూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత ఏసీబీకి పట్టుబడ్డారు. సమస్య పరిష్కారానికి తహసీల్దార్ లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు రూ.2 లక్షల లంచం అందించేందుకు సిద్ధమయ్యారు. ఆ డబ్బు తన డ్రైవర్‌కి ఇవ్వాలని ఆమె సూచించారు. దీంతో బాధితుడు రూ.2 లక్షల నగదును డ్రైవర్ చేతిలో పెట్టాడు. అనంతరం డ్రైవర్ ఆ డబ్బు తీసుకెళ్లి తహసీల్దార్‌కు అందించాడు. దీంతో ఏసీబీ అధికారులు తహసీల్దార్‌తో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## బండి భగీరథ్‌కు మూడు రోజుల పోలీసు కస్టడీ

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మల్కాజిగిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. అతడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు విచారించనున్నారు. వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరగా.. కోర్టు మూడు రోజులకే అనుమతించింది. ఈనెల 16న అరెస్టైన బండి భగీరథ్.. ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు..

### ముగ్గురి దుర్మరణం



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. గోకవరం మండలం కొత్తపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మలిశాల గ్రామానికి చెందిన ఎనిమిది మంది మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లారు. జగ్గంపేటలోని ట్రావెల్స్ నుంచి కృష్ణ అనే వ్యక్తి ఇన్నోవా వాహనాన్ని సెల్ఫ్ సర్వీస్ కోసం తీసుకొచ్చారు. ఆయనతో పాటు మరో ఏడుగురు ఆ వాహనంలో మారేడుమిల్లి వెళ్లారు. తిరిగొస్తుండగా.. కొత్తపల్లి శివారు జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండిపూడి వివేక్ (19), బల్లిలా పద్మ (19), గట్ల లక్కీ (3) మృతి చెందగా.. కృష్ణ, కందిగట్ల నాని, రామకృష్ణ దొర, దుర్గ, నవ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ప్రైవేటు బస్సు దగ్ధం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కొహెడ సమీపంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ప్రైవేటు బస్సు దగ్ధమైంది. శంషాబాద్ ఎయిర్ పోర్టు వైపు నుంచి వస్తుండగా ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బస్సులోంచి కిందకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

### ఒడిశాలో విషాదం.. నిర్మాణంలో ఉన్న

## సెప్టిక్ ట్యాంక్‌లో దిగి ఆరుగురి మృతి

**విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో దిగి ప్రమాదవశాత్తూ ఆరుగురు మృతి చెందిన ఘటన ఒడిశాలోని కాళహండి జిల్లా ఎం.రాపూర్ సమితిలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో జరిగింది. సెప్టిక్ ట్యాంక్ సెంట్రింగ్ తీయడానికి దిగిన మేస్త్రీ ప్రమాదానికి గురయ్యారు. మేస్త్రిని కాపాడేందుకు దిగిన ఐదుగురు ఊపిరాడక చనిపోయారు. గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆరుగురు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర అస్వస్థతకు గురైన మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుల్లో ముగ్గురు మేస్త్రీలు, కార్మికుడు, ఇంటి యజమాని, అతని కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సులో మంటలు..

### ఎంజీబీఎస్ బస్టాండ్‌లో తప్పిన ప్రమాదం



**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ప్లాట్‌ఫాంపై నిలిపి ఉన్న గద్వాల డిపో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. బస్సు కండక్టర్ మంటలు వ్యాపించకుండా నీటితో అర్పివేశారు. ఆర్టీసీ అధికారులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.




**1. రోజుకు ఒక కొబ్బరికాయ న్యూరాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- మెదడు ఆరోగ్యానికి తోడ్పడుతుంది మరియు నరాల క్షీణత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**2. రోజుకు ఒక వాల్‌నట్ సైకియాట్రిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- ఒమేగా-3లు పుష్కలంగా ఉంటాయి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడతాయి మరియు మానసిక స్థితికి తోడ్పడతాయి.

**3. రోజుకు ఒక ఉసిరికాయ ఇమ్యునాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.

**4. రోజుకు ఒక అరటిపండు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- జీర్ణక్రియకు తోడ్పడుతుంది, ఎసిడిటీని తగ్గిస్తుంది మరియు ప్రేగులకు ఉపశమనం కలిగిస్తుంది.

**5. రోజుకు ఒక అంజీర్ పండు ఎండోక్రినాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది మరియు హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది.

**6. రోజుకు ఒక ఖర్జూరం హెమటాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- ఐరన్ అధికంగా ఉంటుంది, రక్తహీనత మరియు అలసటను నివారించడంలో సహాయపడుతుంది.

**7. రోజుకు ఒక దానిమ్మ పండు కార్డియాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది**

- గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది మరియు రక్తపోటును తగ్గిస్తుంది.

**8. రోజుకు ఒక పిస్తా తింటే యూరాలజిస్ట్ అవసరం ఉండదు**

- మూత్రపిండాల పనితీరుకు మద్దతు ఇస్తుంది మరియు మూత్రాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**9. రోజుకు గుప్పెడు బాదం పప్పులు తింటే చర్మవ్యాధి నిపుణుడి అవసరం ఉండదు**

- విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, చర్మ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది మరియు పొడిబారడాన్ని నివారిస్తుంది.

**10. రోజుకు ఒక బొప్పాయి తింటే కాలేయ నిపుణుడి అవసరం ఉండదు**

- కాలేయ నిర్విషీకరణకు మద్దతు ఇస్తుంది మరియు జీర్ణక్రియ, కొవ్వు జీవక్రియకు సహాయపడుతుంది.

### మామిడి పండ్లు ఇలా తింటే

## ఆస్పత్రికి పరుగెత్తాల్సిందే..



వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు.. వేసవి ప్రారంభమైంది. పండ్ల రారాజు మామిడి. వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు చేయవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మామిడి పండ్లు తినడం ప్రమాదకరం. మామిడి పండ్లను అధికంగా తినడం వల్ల లేదా తప్పుడు సమయంలో తినడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో ఇక్కడ తెలుసుకుందాం.. మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తుంటే మామిడి పండ్లు కాస్త మితంగా తినాలి. మామిడి పండ్లలో కేలరీలు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు మామిడి పండు సుమారు 150 నుంచి 200 కేలరీలను అందిస్తుంది. దీనివల్ల బరువు పెరగవచ్చు. మామిడి పండ్లలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మంచిదని భావిస్తారు. అయితే, మామిడి పండ్లను ఎక్కువగా తినడం వల్ల విరేచనాలు లేదా గ్యాస్ రావచ్చు. తరచుగా కడుపు సంబంధిత సమస్యలతో బాధపడేవారు మామిడి పండ్లను పరిమితంగా తినాలి. మామిడి తొక్క లేదా దానిలోని కొన్ని పదార్థాల వల్ల కొంతమందికి చర్మం దురద, దద్దుర్లు, కళ్ళు ఎర్రబడటం వంటి అలెర్జీ ప్రతిచర్యలు కలుగుతాయి. అలాంటి వారు జాగ్రత్తగా ఉండాలి. మామిడిని అధికంగా తినడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరగవచ్చు. దీనివల్ల కీళ్లనొప్పులతో బాధపడే రోగులలో నొప్పి పెరగవచ్చు. మామిడి పండ్లను తినడానికి ముందు కనీసం 1-2 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. దీనివల్ల వాటిలోని రసాయనక ప్రతిచర్యలు తగ్గుతాయి. రాత్రి పడుకునే ముందు మామిడి పండ్లు తినడం మానుకోవాలి. ఎందుకంటే దీనివల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మామిడి పండ్లలో తగినంత సహజ చక్కెర ఉంటుంది కాబట్టి వీటిని తినేటప్పుడు వాటికి చక్కెర కలపడం అంత మంచిదికాదు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజుకు ఒక మధ్యస్థ పరిమాణంలో ఉన్న మామిడి పండు తింటే సరిపోతుంది. ఒకవేళ మీరు మామిడి పండ్ల ముక్కలు తింటుంటే రోజుకు ఒక చిన్న గిన్నెడు మామిడి పండ్లు తింటే సరిపోతాయి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 27 మే, 2026




www.viswamvoice.com

### అరకొర పనులతో ప్రమాదాలకు

# నిలయంగా మారిన పుంతరోడ్లు

- ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన రహదారి పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- పనుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన కార్యకర్త నాగేంద్ర
- నెలలు గడిచినా పూర్తి కాని నిర్మాణాలు
- రాళ్ల రోడ్లపై జారిపడుతున్న ప్రజలు, అదుపుతప్పుతున్న వాహనాలు
- పర్యవేక్షణ మరిచిన అధికారులు, వ్యవస్థపై గ్రామాల్లో ఆగ్రహం!





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలోని పలు గ్రామాలలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన గ్రామీణ రహదారి పనులు ప్రజలకు ఉపయోగం కంటే ఇబ్బందులకే కారణమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో గ్రామ ప్రజలు, రైతులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం సోమేశ్వరంలో పూర్తి కాని రహదారులపై నడుస్తున్న సమయంలో రాళ్లు గుచ్చుకోవడం, ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రత గ్రామ జనసేన అధ్యక్షుడు నాగేంద్ర దృష్టికి రావడంతో పాటి, దిబ్బగరువు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రోడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా, అధికారులు సమస్యపై స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా కాంట్రాక్టర్, రాజకీయ నాయకుల వైపు చూపించడం ఆశ్చర్యానికి గురిచేసిందని నాగేంద్ర విమర్శించారు. రోడ్లకు ఎస్టిమేషన్ తయారు చేయడం, పనుల విధానం నిర్ణయించడం, బిల్లులు ఆమోదించడం వరకు బాధ్యతగా ఉండే అధికారులు, పనుల నాణ్యత, పూర్తి చేయడంలో మాత్రం ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన పనులు ప్రజలకే ప్రమాదంగా మారడం వెనుక నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు ప్రారంభించే సమయంలో హడావుడిగా బోర్డులు, ఫోటోలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు, అనంతరం పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయకపోవడంతో రహదారులు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయని మండిపడుతున్నారు. మండల వ్యాప్తంగా చేపట్టిన అనేక రహదారి పనుల పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

**రాయవరంలో పరిస్థితి మరీ అధ్వాన్నం**

ఇటీవల దినపత్రికలో అభివృద్ధి పేరుతో అంత్యక్రియలకు అడ్డంకులా.? పేరుతో కథనం ప్రచురితమవగా అధికారులు హుటహుటిన గ్రావెల్ గుట్టలను జెసిబి సాయంతో సర్దడం మరింత చర్చనియాంశంగా మారింది. "కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది" అన్న చందాన చక్కగా ఉన్న రహదారులను కొలతలు తగ్గించి పనిచేయడంతో ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు, ఇప్పుడు రహదారుల తీరును చూసి మరింత నిట్టూరుస్తూ ఉన్నారు. గ్రావెల్ సర్దే క్రమంలో అస్తవ్యస్తంగా వదిలేయడంతో ప్రయాణించడానికి పక్కన పెడితే, నడవడానికి కూడా వీలులేని పరిస్థితి కనబడుతుందని దీనికంటే పాత రహదారి ఎంతో మేలని గోడును వెల్లదీస్తున్నారు.

**అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం**

కొన్ని చోట్ల మెటల్ వేసి నెలలు గడిచినా బీటీ పనులు జరగకపోవడం, మరికొన్ని చోట్ల రోడ్ల పై బండరాయి లు వదిలేయడంతో ప్రజలు నిత్యం ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి కాకపోయినా బిల్లులు జరిగాయా? పనుల నాణ్యతను పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు ఎవరు? పనులు ఆలస్యం కావడానికి కారణాలేమిటి? ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రహదారులపై బాధ్యత ఎవరు తీసుకుంటారు? అనే ప్రశ్నలు ఇప్పుడు గ్రామాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

### వైకాపా అనుబంధ కమిటీలు

## అధికారమే ధ్యేయంగా పనిచేయాలి : జక్కంపూడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో రానున్న గ్రామఎన్నికలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నూతనంగా ఎన్నికైన అన్ని విభాగాల కమిటీసభ్యులు పార్టీ అధికారమే ధ్యేయంగా పనిచేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం మండలంలోని పశ్చిమ గోనగూడెం, మునగాల, కోరుకొండ, జంబుపట్నం,కాపవరం తదితర గ్రామాల్లో వివిధ విభాగాల నుండి మండల, గ్రామకమిటీల ప్రక్రియ పూర్తి చేసినట్లు రాజా తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు కానీ హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన రెండేళ్లలోనే ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుందన్నారు. త్వరలో జరగనున్న క్షేత్రస్థాయి ఎన్నికలకు పార్టీలోని అన్ని విభాగాల నుండి కమిటీలు పూర్తి చేశామని, వీరందరితో ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటానికి సంసిద్ధం చేస్తున్నామ న్నారు.అన్ని విభాగాల కమిటీలసభ్యులు ప్రజలతో మమేకమై, రానున్న రోజుల్లో వైకాపా అధికారం చేపట్టడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పార్టీ తరపున కష్టపడిన వారికి తగిన సమయంలో పార్టీ గుర్తిస్తుందన్నారు.ప్రతి కమిటీసభ్యుడు అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల న్నారు. మండల పరిధిలో పరిష్కారం కానీ సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయికమిటీల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకుందా మన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులు పార్టీ తరపున ఎప్పుడు పిలిచిన సమావేశాలకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అడపా కనకరాజు, గణేశుల పోసియ్య, కళ్యాణం రాంబాబు, కొండపల్లి దుర్గారావు, అడబాల జగదీష్,బత్తిన వెంకట్రావు (చిన్ని), వెలిచేటి స్వామి, తూళ్లురి గంగరాజు, మేడిశెట్టి రాంబాబు, మామిడిపల్లి దుర్గాప్రసాద్, కన్నా బత్తుల గణేష్, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి తరపున 223 బిఎల్ఏల నియామకం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మండపేట నియోజకవర్గం లోని 223 బూత్‌లకు బూత్ లెవల్ ఏజెంట్ల పేర్ల జాబితాను మండపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తేజేశ్వరరావుకు అందజేశారు. నియోజక వర్గ బూత్ కన్వీనర్ పోతుల ప్రసాద్, టౌన్ బూత్ కన్వీనర్ సూరంపూడి సత్య ప్రసాద్,మూడు మండలాల బూత్ కన్వీనర్లు ఏలేటి గంగరాజు,గంధం వరప్రసాద్, పోతంశెట్టి సత్యనారాయణ రెడ్డి బిఎల్ఏల వివరాలను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జరుగుతున్న ఓట్ల తొలగింపు,చేర్పులు, మార్పుల ప్రక్రియలో తమ బిఎల్ఏల పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. బిఎల్ఓలతో బిఎల్ఏలను అనుసంధానించి ఓటర్ల జాబితా ఆధునీకరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ను కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట అయ్యప్ప, వైసిపి జిల్లా కార్యదర్శి టేకుమూడి శ్రీను, మండపేట నియోజకవర్గం వైసీపీ ఆర్ టి ఐ కన్వీనర్ మందపల్లి రవి కుమార్, ముక్కా దాలియ్య,పలివెల మధు, కోళ్ళ శ్రీను, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

### "మెగా దగా"డీఎస్సీగా మారింది - మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా డీఎస్సీ పేరుతో ప్రభుత్వం భారీ అవకతవకలకు పాల్పడిందని జక్కంపూడి రాజా ఆరోపించారు. డీఎస్సీ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేసి సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,డీఎస్సీ–2025 నిర్వహణపై అభ్యర్థుల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 6,500 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే విమర్శించిన నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్లు అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు నిర్వహించిన డీఎస్సీ "మెగా దగా"గా మారిందని ఆరోపించారు. డీఎస్సీ నిర్వహణలో గందరగోళం నెలకొందని, ప్రశ్నాపత్రాల తయారీకి సంబంధించిన వ్యవస్థలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి టాప్ ర్యాంకులు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. డీఎస్సీ మెరిట్ జాబితాలను వెబ్‌సైట్ నుంచి తొలగించడం కూడా అవకతవకలకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.36 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, కేవలం 16,430 మందికే ఎంపిక సమాచారం పంపారని, మిగిలిన వారికి మెరిట్ వివరాలు అందించలేదన్నారు. రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనలు సక్రమంగా పాటించలేదని ఆరోపించారు. కొన్ని పోస్టులను రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయించినట్లు ఆడియో, వీడియో టేపులు బయటకు వచ్చాయని పేర్కొంటూ, వాటిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్పోర్ట్స్ కోటాలో కూడా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. గతంలో కూడా నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ, 1995 టెన్త్ క్లాస్, 1997 ఇంటర్మీడియట్, 2017, 2025 పరీక్షల లీకేజీలను ప్రస్తావించారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని జక్కంపూడి రాజా హెచ్చరించారు.

## గోమాతకు జాతీయ జంతువు హోదా కల్పించాలి

**టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** గోమాతకు జాతీయ జంతువు హోదా కల్పించాలని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ఫరూఖ్ షిబ్లీ పరివేక్షణ లో గత 12 సంవత్సరాలుగా ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ లోని ముస్లింలు నిరంతరం డిమాండ్ చేస్తూ వస్తున్నారన్నారు.ఈ విషయంపై హిందువు సోదరుల మనోభావాలను గౌరవించాలని నాడు నేడు ఒకే మాటపై ముస్లింలు ఏక అభిప్రాయంతో ఉన్నారన్నారు.దేశంలో హిందూ సోదరుల మనోభావాలకు గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో, సామాజిక సామరస్యం పరస్పర గౌరవ భావనతో భారతదేశం లో ముస్లిమ్ మత పెద్దలు గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతున్నారని పేర్కొన్నారు. నిరంతరం గా ఈ డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్తున్నరన్నారు.మతాలువేరు కావచ్చు అంతా ఒకటే పరస్పర గౌరవం అందరి బాధ్యత గా స్పష్టం చేశారు. ప్రపంచం లో ఉన్న మానవులు అందరు భూమిపై మొదటి మానవుల జంట ఆదం, హవ్వ ల సంతానం గా పేర్కొన్నారు. వారి సంతతికి చెందిన వాళ్ళమే అన్నారు. ఈ సందేశంతో గో సంరక్షణ, సామాజిక ఐక్యత, సౌభ్రాతృత్వం కోసం దేశంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం రాజకీయా నాయకులు కృషి చేస్తున్నారనీ చెప్పారు. ఈ డిమేండ్ నెరవేరెవరకు కేంద్రప్రభుత్వం పై వత్తిడి చేయాలని దేశం లోని ముస్లిం పెద్దలకు విజ్ఞప్తి చేశారు.

## బాలికలు.. సోషల్ మీడియా మాయలో పడొద్దు

**బాలికల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యం**

**పసలపూడిలోని అంగన్వాడీ ఆధ్వర్యంలో కిషోరీ వికాసం కార్యక్రమం**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మొబైల్ ఫోన్‌ను అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తూ సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్త పడాలని కిషోరి బాలికలకు అంగన్వాడీ కార్యకర్త డి. ఆదిలక్ష్మి పలు సూచనలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో పూర్ణిమ ఆదేశాల మేరకు మంగళవారం "కిషోరీ వికాసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలబాలికలకు విద్య, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు, బాలికలపై వేధింపులు, చదువుపై నిర్లక్ష్యం వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్యలను ఎదుర్కొనేందుకు బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త డి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాలికలు మొబైల్ ఫోన్లను అవసరానికి మాత్రమే వినియోగించాలని, సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా కిషోరీ బాలికలకు వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం, రక్తహీనత నివారణ, మానసిక ఆరోగ్యం, సురక్షిత జీవన విధానం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. బాలికలు చదువుతో పాటు తమ లక్ష్యాల సాధన కోసం కష్టపడాలని, సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించేలా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో చైతన్యం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుధా, హారిక, మంగ, సునీత, రాజేశ్వరి, విజయ, శృతి తదితరులు, కిషోరి బాలబాలికలు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలోని పలు వార్డుల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విస్తృతంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణ డ్రైన్ల పూడికతీత మరియు రోడ్ల పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.వి. ఆర్ రాజు, డి.ఈ శ్రీకాంత్‌లు పట్టణంలో సాగుతున్న శానిటేషన్ పనుల వివరాలను మంత్రికి వివరించారు. పర్యటన అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి రాజీ లేకుండా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా ప్రజల్లో పారిశుధ్యంపై మరింత అవగాహన కల్పించాలని ముఖ్యంగా దోమల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డ్రైన్లలో మురుగునీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీసిన మంత్రి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గణేష్ శర్మ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, కవల నానాజీ, వాసంశెట్టి బాల, గుబ్బల వెంకటరమణ తదితర కూటమి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




# శ్రమజీవుల సంక్షేమానికి దిశానిర్దేశం చేసే వేదికే మహానాడు

## మంత్రి వాసంశెట్టి సుభాష్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచే మహానాడు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే మహత్తర వేదిక అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ పేర్కొన్నారు. కార్యకర్తల కష్టం, నిబద్ధత, ప్రజాసేవే తెలుగుదేశం పార్టీ బలమని కార్యకర్తే నాయకుడు అనే సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన చారిత్రాత్మక వేదిక మహానాడేనని ఆయన కొనియాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి మహిళా సాధికారతకు అండగా నిలిచిందని ఈసారి "స్త్రీశక్తి" నినాదంతో నిర్వహిస్తున్న మహానాడు మహిళల ఆత్మవిశ్వాసానికి కొత్త బాటలు వేస్తుందని తెలిపారు. మహిళలు, యువత, కార్మికులు, రైతుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని మహానాడు-2026 ముందుకు సాగుతుందని మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. మహానాడు-2026 కేవలం రాజకీయ సమావేశం మాత్రమే కాదని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి సృష్టి, పారిశ్రామిక ప్రగతికి మార్గదర్శకంగా నిలిచే ప్రజా వేదిక అని మంత్రి వివరించారు. రాష్ట్ర యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడం పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టించడం, కార్మిక సంక్షేమానికి మరిన్ని సంస్కరణలు తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహానాడు వేదికగా ప్రజల ముందుంచుతామని మంత్రి తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం అనుసరించే కార్యాచరణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివరిస్తారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తున్నామనే సందేశాన్ని మహానాడు ద్వారా రాష్ట్ర ప్రజలకు చేరవేస్తామని కార్మికులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తును బలోపేతం చేస్తాయని అన్నారు. ఇదే సమయంలో అభివృద్ధిని అడ్డుకునే విధ్వంసక రాజకీయాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. గత పాలనలో పెట్టుబడులు పారిపోవడం, యువత ఉపాధి అవకాశాలు కోల్పోవడం, పరిశ్రమలు మూతపడటం రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. మహానాడు-2026ను మహోత్సవంలా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా సిద్ధమయ్యారని గ్రామగ్రామాన పార్టీ జెండాలు రెపరెపలాడుతున్నాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహానాడు అంటే కేవలం సభ కాదు... అది తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక... కార్యకర్తల ఆత్మవిశ్వాసానికి నిదర్శనం... అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి మహాసంకల్పం అని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ రాహుల్ మీనా




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.వి.సి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నిర్మూలన, మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువతకు ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, ఫేక్ కాల్స్, ఓటీపీ మోసాలు, క్యూ ఆర్ కోడ్ స్కామ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచితులతో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు, మార్ఫింగ్ ఫోటోలు, బ్లాక్‌మెయిలింగ్ వంటి నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మొబైల్ ఫోన్లలో బలమైన పాస్‌వర్డ్లు, టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. "థింక్ బిఫోర్ యూ క్లిక్ - సెక్యూర్ టుడే, సేఫ్ టుమారో" అనే నినాదంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు పిలుపునిచ్చారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల మూలాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గంజాయి లేదా డ్రగ్స్ సేవించిన వారిని అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా మూత్రం లేదా లాలాజల నమూనాలను పరీక్షించి గుర్తిస్తున్నామని చెప్పారు. మత్తుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ అందించి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా లేదా వినియోగంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని, సంబంధిత సమాచారం స్థానిక పోలీసులకు అందించాలని కోరారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న శక్తి యాప్‌ను ప్రతి మహిళ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ సదుపాయం ద్వారా వెంటనే పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళల భద్రత కోసం 181 హెల్ప్‌లైన్, అత్యవసర సేవల కోసం 112 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డీఎస్పీ, ఎస్‌బీసీఐ పుల్లారావు, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్, అమలాపురం తాలూకా ఎస్ఐ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నెలాఖరులోగా గృహాల గణనను వేగవంతం చేసి పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ జనగణన ప్రక్రియలో అత్యంత కీలకమైన గృహాల గణన (హౌస్ లిస్టింగ్) కార్యక్రమాన్ని మే నెలాఖరులోగా వేగవంతంగా పూర్తి చేసి, వంద శాతం నమోదు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ఏపీ జనగణన నోడల్ అధికారి, ప్రత్యేక కమిషనర్ ఎస్.ఎస్. రావత్, జనగణన డైరెక్టర్ జె. నివాస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల కలెక్టర్లకు జనగణన ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణనలో ఏ ఒక్కరూ మిస్ కాకుండా అందరినీ సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. జనగణన ప్రక్రియ పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ చూపి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జనగణన దేశ భవిష్యత్ ప్రణాళికలకు దిక్సూచి వంటిదని, ఇందులో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వరాదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గృహాల నమోదు ప్రక్రియను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఛార్జ్ అధికారులైన తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో గణన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రజలందరూ తమ ఇంటికి వచ్చే జనగణన సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వడం గానీ, వివరాలు దాచడం గానీ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. లక్ష్యాలను సకాలంలో చేరుకోని వారు, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి, జిల్లా అర్థగణాంక అధికారి ఎం. మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఉప తహశీల్దార్ శివరాజ్, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### మడికి శ్రీరాములు ఆధ్వర్యంలో

# ప్రతిభా విద్యార్థుల అభినందన సభ




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాబూ జగజ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ మడికి శ్రీరాములు, వారి సతీమణి ఫౌండేషన్ డైరెక్టర్ మడికి రోజాపుష్పం ఆధ్వర్యంలో కామనగురువు సుభాష్ లే అవుట్‌లో చేట్ల నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇటీవల 10వ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులు, విద్యార్థినులను మడికి శ్రీరాములు స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడు బొమ్మి ఇశ్రాయేలు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. అనంతరం అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు 10వ తరగతి తర్వాత చదవవలసిన కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులను దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించి మెమెంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జగజ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి సత్యనారాయణ, తెలుగు అధ్యాపకుడు సీలి సాంసన్, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రాయి వెంకటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు, కముజు నాగేశ్వరరావు, మోకాటి సత్యనారాయణ, యార్లగడ్డ సంజీవయ్యతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### శృంగేరి శారదా పీఠం భగవద్గీత పోటీల్లో

# 'రాధాకుమారి'కి ప్రథమ స్థానం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత మెమరైజేషన్ పోటీల్లో కొత్తపేటకు చెందిన కంచర్ల రాజా భార్య రాధాకుమారి ప్రతిభాపాటవాలు కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించారు. ఆధ్యాత్మిక జ్ఞానం, అంకితభావంతో పోటీల్లో పాల్గొన్న ఆమె విజయం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. కొత్తపేట వాసవీ కన్యకా పరమేశ్వరి మహిళా సంఘంలో ముఖ్య సలహాదారుగా సేవలందిస్తున్న రాధాకుమారి, పోటీల్లో ప్రారంభ దశ నుంచి ఫైనల్ వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు.ప్రపంచ నలుమూలల నుంచి పాల్గొన్న అనేక మంది పోటీదారుల మధ్య ఆమె తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. శృంగేరి పీఠంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు పాల్గొనగా, ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రథమ స్థానం సాధించిన ఏకైక వ్యక్తిగా రాధాకుమారి నిలిచారు.ఆమె సాధించిన ఈ విజయంతో కొత్తపేట ప్రాంతానికి ప్రత్యేక గౌరవం దక్కిందని స్థానికులు పేర్కొంటున్నారు.ఇటీవల శృంగేరి శారదా పీఠంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పీఠాధిపతి శ్రీ భారతీ తీర్థ మహాస్వామి సమక్షంలో పీఠం నిర్వాహకులు రాధాకుమారిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రంతో పాటు రూ.21 వేల నగదు బహుమతిని అందజేశారు. రాధాకుమారి సాధించిన ఈ ఘనతపై మహిళా సంఘాల ప్రతినిధులు, ఆధ్యాత్మిక వర్గాలు, స్థానిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ప్రధాని మోదీ 12 ఏళ్ల సుపరిపాలన

## హసన్‌బాద్‌లో ఘనంగా చిత్రపట ఆవిష్కరణ




**హసన్‌బాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నరేంద్ర మోదీ మొదటిసారిగా దేశ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి పన్నెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం హసన్‌బాద్ గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ రావు మాట్లాడుతూ.. మోదీ పన్నెండు సంవత్సరాల సుపరిపాలనలో మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలతో దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. అంతర్జాతీయంగా దేశ సత్సంబంధాలు పెరగడంతో పాటు ఆర్థిక ద్రవ్యోల్బణాన్ని సమర్థవంతంగా నియంత్రించగలిగారని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు, మహిళల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. ఇదే సమయంలో పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల రాబోయే ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా ప్రధాని మోదీ చేసిన సూచనలను మనమందరం తూచా తప్పకుండా పాటించాలని ఆయన స్థానికులకు పిలుపునిచ్చారు. అనంతరం మోదీ నాయకత్వం వర్ధిల్లాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ స్థానికులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### 596 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించిన విద్యార్థినికి

# రూ.20 వేల నగదు బహుమతి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల విడుదలైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 596 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ స్థానంలో నిలిచిన శిరిగినీడి రిషిత లక్ష్మి నిహారికను మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్, కొమరగిరిపట్నం, రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్, గోడిలంక సంయుక్త ఆధ్వర్యంలో రూ.20 వేల నగదు, మెమెంటో, దుశ్శాలువాతో సత్కరించారు. విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరభరాజును కూడా ట్రస్ట్ అధ్యక్షులు దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్ రాజు, గ్రామ మాజీ సర్పంచ్ సుందర్నీడి సాయికృష్ణ, విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఎం.టి.వి. సుబ్బారావు, అల్లుమిల్లి శ్రీనుబాబు, నంద్యాల గురునాయుడు, కముజు శివకుమార్, సి.హెచ్.రాజేష్, ఆనంద్ నవీన్, అడబాల వెంకట శ్రీనివాస్, ఎం.శ్రీరామచంద్రమూర్తి, పి.రామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోసుగంటివెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన నిహారిక ఉన్నత విద్యను అభ్యసించి సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత ఉద్యోగం సాధించి దేశ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి విద్యా సంవత్సరంలో మండలంలోని అన్ని హైస్కూల్ విద్యార్థులకు పరీక్షా కిట్లు అందించడంతో పాటు పాఠశాలల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు అందిస్తున్న రెండు ట్రస్టుల సేవలను ప్రధానోపాధ్యాయుడు, గ్రామ పెద్దలు కొనియాడారు.

# రాష్ట్ర వ్యాప్తంగా 27, 28 తేదీలలో ఘనంగా మహానాడు వేడుకలు

## మహానాడు వేడుకలకు కొత్తపేట నియోజకవర్గంలో సర్వం సిద్ధం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, సంక్షేమ పాలనకు ఆద్యుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 27, 28 తేదీలలో ఘనంగా మహానాడు వేడుకలు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో మహానాడు వేడుకలకు కొత్తపేట నియోజకవర్గంలో సర్వం సిద్ధం హైబ్రిడ్ విధానంలో టీడీపీ మహానాడు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 10 క్లస్టర్ల ఏర్పాటు ప్రతి క్లస్టర్‌లో కార్యకర్తలకు ప్రత్యేక సౌకర్యాలు ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో రెండేసి క్లస్టర్లు, కొత్తపేట, రావులపాలెం మండలాలలో మూడేసి క్లస్టర్లు మహానాడుకు సిద్ధం ప్రతి క్లస్టర్ కు.కోఆర్డినేటర్ల నియామకంతో మహానాడు నిర్వహణలో వేగం సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా ఎల్ఈడి స్క్రీన్ల ఏర్పాటు నియోజకవర్గం వ్యాప్తంగా పసుపుమయంతో మహానాడు సందడి పసుపు జెండాలతో కళకళలాడుతున్న మహానాడు ప్రాంగణాలు మహిళలు, యువత ప్రాధాన్యతే లక్ష్యంగా ఈసారి మహానాడు నిర్వహణ మహిళా కార్యకర్తలకు ప్రత్యేక ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే క్లస్టర్ విధానం లక్ష్యం మహానాడు తొలి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమాలు పార్టీ జెండా ఆవిష్కరణ, ఎన్టీఆర్‌కు ఘన నివాళులతో మహానాడు ప్రారంభం, తెలుగుతల్లి గీతంతో మార్మోగనున్న మహానాడు వేదికలు క్లస్టర్ల వారీగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమీక్ష నియోజకవర్గం అంతా ఏర్పాట్లపై నేతలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతి కార్యకర్త మహానాడులో భాగస్వామి కావాలని ఎమ్మెల్యే బండారు పిలుపు. మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న టీడీపీ ప్రతి క్లస్టర్ ఒక మహానాడు వేదిక కార్యకర్తల ఉత్సాహంతో మార్మోగుతున్న కొత్తపేట నియోజకవర్గం అందరూ విధిగా మహానాడులో పాల్గొనాలని బండారు పిలుపు.

### కేంద్ర మంత్రిని కలిసిన

# ముమ్మిడివరం నియోజవర్గం బీజేపీ నేతలు



**ముమ్మిడివరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ కాలేజీ ఆడిటోరియంలో రెండు రోజులపాటు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ అభియాన్ 2026 జిల్లా కార్యశాల సందర్భముగా విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను భారతీయ జనతా పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ, ముమ్మిడివరం నియోజవర్గం మార్కెటింగ్ యాడ్ వైస్ చైర్మన్ గొల్ల కోటి వెంకటరెడ్డి డైరెక్టర్ మట్ట సూరిబాబు ఐ.పోలవరం మండల బీజేపీ అధ్యక్షులు భైరవమూర్తి, ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు విశేష కృషి చేయాలని సూచించారు.

### కొత్తపేట మహానాడు ఏర్పాట్లను

# పర్యవేక్షించిన అబ్జర్వర్ కన్నబాబు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గంలో మహానాడు 2026 ఏర్పాట్లను పార్టీ పరిశీలకుడు ప్రశాంత్ కుమార్ (కన్నబాబు) మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కొత్తపేట మండలం వానపల్లి, మోడేకూరు గ్రామాల్లో కళ్యాణ మండపాలు వద్ద ఏర్పాటు చేసిన 7,8 క్లస్టర్స్ వద్ద స్క్రీన్,డయాస్, సౌండ్ సిస్టం తదితర వాటిని గురించి పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, క్లస్టర్ ఇంచార్జు పల్లి ఏసు, కముజు గంగాధర్ రావు, రెడ్డి తాతాజీ, యూనిట్ ఇంచార్జ్ బండారు వీరబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా తెలుగుదేశం పార్టీ

## రెండు కుటుంబాలకు రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కుల అందజేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకుని పార్టీ కార్యకర్తలుగా కొనసాగుతూ ఇటీవల మరణించిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా మంజూరైన ప్రమాద బీమా చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ. 10 లక్షలు బీమా సాయం అందించారు. కె.గంగవరం మండలం అముజూరు గ్రామానికి చెందిన కార్యకర్తల కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ బాధ్యత అని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. అముజూరు గ్రామానికి చెందిన పాలపర్తి శేషగిరిరావు, గుత్తుల శ్రీనివాస్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ప్రమాద బీమా నిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. కష్టకాలంలో ఉన్న ఈ కుటుంబాలకు ఈ సహాయం ఆర్థిక భరోసాగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, రామచంద్రపురం రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, గరికపాటి సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ మరివాడ చిన్నికృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సేవలకు కృషి : మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం, ద్రాక్షారామ, గంగవరం మండలాల్లో పెరుగుతున్న ఎండ తీవ్రత మరియు విద్యుత్ వినియోగంపై కీలక ప్రకటన చేశారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరిన నేపథ్యంలో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల వాడకం పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ ప్రజలకు నిరంతర విద్యుత్ అందించేందుకు అధికారులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధి నిర్వహణలో నిమగ్నమవుతున్న లైన్ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తాళ్లపొలం, నవరత్నాల గరువు, ఉట్రుమిల్లి, తాడిపల్లి, వెలంపాలెం, నెలపర్తిపాడు, జేకే పాలెం గ్రామాల్లో అదనపు డీటీఆర్‌లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో లో-వోల్టేజ్ సమస్యలు తగ్గాయని వివరించారు. గొల్లలచెరువు, కందులపాలెం, హసనాబాద్, ఉండూరు గ్రామాల్లో కొత్త లైన్లు, త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచామని చెప్తూ విద్యుత్ ఆదాలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ముఖ్యంగా కరెంట్ పోయి మళ్లీ వచ్చిన వెంటనే ఏసీలు, భారీ ఉపకరణాలను ఒకేసారి ఆన్ చేయకుండా, కొద్దిసేపటి తర్వాత ఆన్ చేయడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి తగ్గించవచ్చని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలంతా సహనంతో విద్యుత్ సిబ్బందికి సహకరించాలని మంత్రి సుభాష్ విజ్ఞప్తి చేశారు.

# శంఖవరం ఆసుపత్రి విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ మరమ్మతు చేయాలి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్తు సమస్యను వారం రోజులుగా పరిష్కరించక పోవడంపై ఆస్పత్రి నిర్వహణ చాలా ఇబ్బందికరంగా మారిపోయింది. ఆస్పత్రి ప్రాంగణంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు వారం రోజుల క్రితం కావాలనే ధ్వంసం చేసారు. ఈ కారణంగా వారం రోజుల నుండి శంఖవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సక్రమంగా కరెంటు రాని పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ను ధ్వంసం చేసిన వారిపై వెంటనే పోలీసులకు పిర్యాదు చేయాలని, అదేవిధంగా ప్రాథమిక ఆర్యోగ కేంద్రం వెనుక భూ భాగంలో 3 ఎకరాల భూమిని కొంత మంది అక్రమంగా సర్వీస్ తోటలు, వరి పంటలు పండించిస్తున్నారని, హాస్పటల్ సిబ్బంది గానీ, పాలకవర్గం గానీ ఏ విధమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని కావున వారిపై తక్షణం చర్యలు తీసుకుని ఆస్పత్రి భూమికి చుట్టూ కంచిని ఏర్పాటు చేయించాలని కోరుతూ ఇంచార్జ్ వైద్యురాలు బిట్రా దేవ్యా ఆషికకు శంఖవరం గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, సమాచార హక్కు ప్రచార కార్యకర్త మేకల కృష్ణ, పర్వత రామకృష్ణ, బొమ్మిడి సత్యనారాయణ (చిట్టిబాబు) తదితరులు మంగళవారం ఫిర్యాదు చేసారు. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోనుటకు ఆస్పత్రి డిడిఓ, ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ కు నివేదిస్తానని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆసిక తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యుత్ సమస్యపై స్థానిక విద్యుత్తు శాఖ అస్టిసెంటు ఇంజనీర్ భగతి కుమార్ కు మేకల కృష్ణ చరవాణిలో పిర్యాదు చేశారు. ఆయన వెంటనే మరమ్మతులు చేస్తామనని స్పష్టమైన హామి ఇచ్చినట్లు స్థానిక మీడియాకు మేకల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

# కాకినాడ రూరల్‌లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నాయీ బ్రాహ్మణ సేవ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం గైగోలుపాడు నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జరిగింది. లంక అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షులుగా కోట ఉమ అచ్యుతరమణ, కార్యదర్శిగా చింతలూరి వీర వెంకట శివప్రసాద్, కోశాధికారిగా పైన గణేష్ అలాగే మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులను నింపే అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని వివరించారు. ముఖ్యంగా నాయి బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయడం, దేవాలయాల పాలక మం డళ్లలో నాయి బ్రాహ్మణులు ఒకరికి అవకాశం కల్పించడం, 6ఏ కింద 44 దేవాలయాలలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు 20వేల వేతనాన్ని 25 వేలకు పెంచడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గం నిబద్ధతతో పనిచేయాలని, నాయి బ్రాహ్మణులకు ఎటువంటి కష్టమొచ్చినా అందు బాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధన్వంతరి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వివిఎస్ గోపాలకృష్ణ మాట్లాడుతూ నూతన కార్యవర్గం నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 50 సంవత్సరాలు నిండిన నాయి బ్రాహ్మణులకు పెన్షన్లు మంజూరు చేయాలని, అలాగే వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, కాకినాడ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మెలిపాక నాగబాబు అలాగే కృష్ణమోహన్, కొమ్మన అమ్మన గారు, వాడపల్లి ముసలయ్య, భీమనపల్లి జానకి రామయ్య, టి.మాణిక్యాలరావు, తలపులమ్మ లోవ దేవస్థానం పాలకమండలి సభ్యులు వెంకటపతి, నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘం అధ్యక్షులు దంగేటి పాపారావు, కొమ్మన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

### వరి సాగులో అధిక దిగుబడులకు మొలక శాతం పరీక్ష,

# శాస్త్రీయ విత్తన శుద్ధి తప్పనిసరి

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుత సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రామచంద్రపురం మరియు పరిసర ప్రాంతాల వరి రైతులు ఆశించిన మేర దిగుబడులు సాధించడానికి విత్తన నాణ్యత, ముందస్తు మొలక శాతం పరీక్ష మరియు శాస్త్రీయ విత్తన శుద్ధి అత్యంత కీలకమని రామచంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకులు బి. నాగకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనం మరియు నేల ద్వారా ఆశించే తెగుళ్లు, పురుగులు, శిలీంధ్రాల నుండి మొలకెత్తే మొక్కలను కాపాడటానికి విత్తన శుద్ధి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంత వాతావరణ మార్పులను తట్టుకోవడానికి, వరిలో అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు వంటి ముందస్తు సమస్యలను నారుమడి దశ నుంచే నివారించడానికి విత్తన శుద్ధి ఏకైక చౌకైన, శాస్త్రీయ మార్గమని స్పష్టం చేశారు. మార్కెట్లో కొనుగోలు చేసిన లేదా సొంతంగా నిల్వ ఉంచుకున్న వరి విత్తనాలను నారుమడి పోయడానికి ముందే మొలక శాతం పరీక్షించుకోవాలని వరి పంటకు కనీస మొలక శాతం 80% నుండి 85% ఉండాలని అధికారులు సూచించారు. ఇందుకోసం రైతులు 'గుడ్డ పద్ధతి' (రాగ్ డాల్ మెథడ్) పాటించవచ్చు. ఒక శుభ్రమైన కాటన్ గుడ్డను నీటితో తడిపి, అదనపు నీటిని పిండేసి, దానిపై వరుసగా 100 వరి విత్తనాలను అమర్చి చుట్ట చుట్టాలి. దీనిని ప్లాస్టిక్ కవర్లో లేదా నీడ పట్టున ఉంచి, గుడ్డ ఆరిపోకుండా రోజువారీగా కొద్దిగా నీరు చల్లుతూ తేమను కాపాడాలి. అంతర్జాతీయ విత్తన పరీక్షా ప్రమాణాల ప్రకారం వరి విత్తనాల మొలకల లెక్కింపును కచ్చితంగా నిర్ధారిత రోజుల్లోనే చేపట్టాల్సి ఉంటుంది. విత్తనాలు పెట్టిన 5వ రోజున మొదటి లెక్కింపు చేపట్టి, వేగంగా, బలంగా మొలకెత్తిన సాధారణ మొలకలను గుర్తించాలి. అనంతరం సరిగ్గా 10వ రోజున తుది లెక్కింపు చేపట్టాలి. ఈ పదో రోజున పరిపూర్ణమైన వేరు వ్యవస్థ, కాండం, ఆకులు ఉన్న ఆరోగ్యకరమైన సాధారణ మొలకలను మాత్రమే లెక్కలోకి తీసుకోవాలి. వేరు సరిగ్గా లేని అసాధారణ మొలకలను కుళ్ళిపోయిన లేదా అస్సలు స్పందన లేని చనిపోయిన విత్తనాలను లెక్కింపులోకి తీసుకోకూడదు. 10వ రోజున వచ్చిన సాధారణ మొలకల సంఖ్యే ఆ విత్తనాల మొలక శాతంగా నిర్ధారణ అవుతుంది. విత్తన నియంత్రణ చట్టం ప్రకారం నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువ మొలక శాతం ఉన్న విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. మొలక శాతం సరిగ్గా ఉన్న విత్తనాలకు నాటడానికి ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని దీనివల్ల తెగుళ్ల నివారణతో పాటు అధిక మొలక శాతం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం మరియు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి లభిస్తుందని వివరించారు. విత్తన శుద్ధిలో భాగంగా రసాయన పద్ధతిలో కార్బెండజిమ్ లేదా మ్యాంకోజెబ్ వంటి మందులను కిలో విత్తనానికి 2-3 గ్రాముల చొప్పున కలిపి శుద్ధి చేయాలి. నారుమడి తెగుళ్ల రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లేదా థయామెథాక్సామ్ వంటి సపోర్టివ్ ఇన్సెక్టిసైడ్‌లను ఉపయోగించవచ్చు. పర్యావరణానికి హాని చేయని జీవ నియంత్రణ పద్ధతిలో కిలో విత్తనానికి 4-10 గ్రాముల సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ వాడాలి. అలాగే వరికి నత్రజని భాస్వరం వంటి పోషకాలు అందేలా చేయడానికి అజోస్పిరిల్లమ్ లేదా పి.ఎస్.బి వంటి జీవ ఎరువులతో విత్తన శుద్ధి చేసుకోవచ్చు. విత్తన శుద్ధి చేసేటప్పుడు రైతులు కచ్చితంగా 'F-I-R' (ఫంగిసైడ్ - ఇన్సెక్టిసైడ్ - రైజోబియం/జీవ ఎరువులు) సూత్రాన్ని క్రమపద్ధతిలో పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. మొదట శిలీంధ్రనాశకంతో ఆ తర్వాత కీటకనాశకంతో శుద్ధి చేసిన 2 నుండి 3 గంటల తర్వాత లేదా మరుసటి రోజు మాత్రమే జీవ ఎరువులను కలపాలని రసాయన శుద్ధి చేసిన వెంటనే జీవ ఎరువులను కలపకూడదని స్పష్టం చేశారు. శుద్ధి చేసిన విత్తనాలను ఎల్లప్పుడూ నీడలోనే ఆరబెట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో పెట్టకూడదు. రసాయనాలతో విత్తన శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముక్కుకు మాస్క్ తప్పనిసరిగాధరించాలని ఈ విత్తనాలను కేవలం విత్తడానికి మాత్రమే వాడాలి తప్ప తిండికి గానీ పశువుల మేతకు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని హెచ్చరించారు. కావున, వరి రైతులందరూ తప్పనిసరిగా 5 మరియు 10 రోజుల వ్యవధిలో మొలక శాతం పరీక్షించి ఆపై శాస్త్రీయంగా విత్తన శుద్ధి చేసిన తర్వాతే నారుమడులు పోసుకోవాలని వ్యవసాయ శాఖ కోరింది. మరిన్ని వివరాలకు సందేహాలకు స్థానిక రైతు సేవా కేంద్రం ఇన్ చార్జిని గాని, వ్యవసాయ విస్తరణాధికారి లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాల్సిందిగా కోరారు.

**వ్యవసాయ శాఖ కీలక సూచనలు**




# ప్రజలు రానున్న ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

**అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలి : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ హెచ్చరికల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో తీవ్ర ఎండలు, హీట్ ఇండెక్స్ అధికంగా నమోదయ్యే అవకాశముందని తెలిపారు. ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మధ్యాహ్న సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల వరకు, హీట్ ఇండెక్స్ 54 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశమున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. డేంజర్ కేటగిరీలో ఉన్న మండలాల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**డేంజర్ కేటగిరీలో ఉన్న మండలాలు ఇవే (19)**

అమలాపురం, మామిడికుదురు, రావులపాలెం, అయినవిల్లి, కొత్తపేట, కొత్తపల్లి గంగవరం, మండపేట, ఆలమూరు, పి. గన్నవరం, ఆత్రేయపురం, ఐ .పోలవరం, అంబాజీపేట, ముమ్మిడివరం, కాట్రేనికోన, సఖినేటిపల్లి, రాజోలు, అల్లవరం, రామచంద్రపురం, ఉప్పలగుప్తం మండలాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంత వరకు బయటకు వెళ్లకుండా ఉండాలి. తరచూ నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. తేలికపాటి, పలుచని పత్తి దుస్తులు ధరించాలి. ఎండలో పనిచేసే వారు తలకు గుడ్డ లేదా టోపీ ధరించాలి. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరంలో నీరు తగ్గకుండా జాగ్రత్త పడాలి. అస్వస్థత, తలనొప్పి, వాంతులు, అధిక అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అప్రమత్తంగా పనిచేస్తోందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు.

# రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వైద్యులకు ఘన సత్కారం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తూ పదోన్నతి (ప్రమోషన్)పై బదిలీ అవుతున్న వైద్యులకు మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఘన వీడ్కోలు చిరు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో విశేష సేవలందించి పదోన్నతిపై వెళుతున్న డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శ్రీనివాసరావు డాక్టర్ నరేంద్రలను కూటమి నాయకులు, ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు మరియు ఆసుపత్రి సిబ్బంది సంయుక్తంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్, ఇతర పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

### పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ కార్యక్రమంలో

# పాల్గొన్న ముమ్మిడివరం అసెంబ్లీ నాయకులు



**ముమ్మిడివరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ కాలేజీ ఆడిటోరియంలో రెండు రోజులపాటు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ అభియాన్ 2026 జిల్లా కార్య శా ల సందర్భముగా భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమం కు ముమ్మిడివరం నియోజకవర్గ నాయకులు జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొలకోటి వెంకటరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మట్టా సూరిబాబు నంద్యాల చంటి ముమ్మిడివరం అసెంబ్లీ లోగల ఐదు మండల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు చివరి రోజు ముగింపు కార్యక్రమం కు కేంద్ర మంత్రివర్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ హాజరై జన సంఘం నుంచి భారతీయ జనతా పార్టీ ఏ విధముగా ఆవిర్భావం జరిగినది పూర్తిగా కార్యకర్తలకు వివరించడం జరిగింది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అధిక సంఖ్యలో కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పిస్తాం బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇస్తున్న నిధులను ప్రజలకు వివరించవలసిందిగా కోరినారు.

# జాతీయ రహదారిపై ఎన్నో ఏళ్లుగా ఉన్న జంక్షన్ తెరవాలి

**- అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెంలోని ఆర్.టి.సి బస్ స్టేషన్ ఇన్ గేట్ ఎదురుగా జాతీయ రహదారిపై ఎన్నో ఏళ్లుగా ఉన్న జంక్షన్ ను ఇటీవల మూసివేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠంగా ప్రజల తరపున రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. ఆదేశాలు మేరకు రావులపాలెంలోని నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే జంక్షన్ ను మూసివేయడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నాలుగు లైన్లుగా విస్తరణ జరిగిన తర్వాత రావులపాలెంలో ప్రధానంగా కళా వెంకట్రావు సెంటర్లోను, ఆర్టీసీ బస్ స్టేషన్ ఇన్ గేట్ వద్ద రోడ్డు దాటేందుకు జంక్షన్లు ఏర్పాటు చేశారు. ఈ జంక్షన్ల మధ్య కొన్ని మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అయితే ఎన్నో ఏళ్లుగా ఈ జంక్షన్ల ద్వారా వందలాది వాహనాలు, ప్రజలు రోడ్డు దాటుతుంటారు. ఇన్ గేట్ వద్ద ఉన్న జంక్షన్ తాజాగా మూసివేయడంతో ప్రజలకు రోడ్డు దాటేందుకు ఒక్క కళా వెంకట్రావు సెంటర్ మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో బస్ స్టేషన్ ఇన్ గేట్ లోకి వెళ్ళే ప్రయాణీకులు, సి.ఆర్.సి వైపు వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. అలాగే సి.ఆర్.సి రోడ్డులో ఉన్న శ్మశాన వాటికకు వెళ్ళేందుకు ఇదే మార్గం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే రావులపాలెం సెంటర్‌లో రావులపాడు వరకు జంక్షన్ వరకు రోడ్డు దాటే అవకాశం లేకపోవడంతో చుట్టూ తిరిగి కళా వెంకట్రావు సెంటర్ కు రావాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో మొత్తం వాహనాలు, ప్రజలు కళా వెంకట్రావు సెంటర్లో రోడ్డు దాటేందుకు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. శనివారం వస్తే కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్ళే భక్తుల వాహనాలతో జాతీయ రహదారి మరింత రద్దీగా మారుతుంది. వాహనాల రద్దీతో కళా వెంకట్రావు సెంటర్ పద్మ వ్యూహాన్ని తలపిస్తుంది. హైవే జంక్షన్ మూసివేయడంతో చుట్టూ తిరిగి రాలేక కొందరు మూసివేసిన హైవే జంక్షన్ వద్దనే నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు దాటుతుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని బస్ స్టేషన్ ఇన్ గేట్ వద్ద జంక్షన్ ను ఎప్పటిలాగే ఓపెన్ చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సోమవారం భారతీయ జనతా పార్టీ డా. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్ ఆర్.మహేష్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

# క్యాన్సర్ బాధితుని కుటుంబానికి అండగా మంత్రి వాసంశెట్టి సుభాష్



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితునికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించి మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం యర్రపోతవరం గ్రామానికి చెందిన అనసూరి గోవిందు గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. గోవిందు కుటుంబ ఆర్థిక పరిస్థితులను స్థానిక కూటమి పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, మానవత్వమే పరమావధిగా భావిస్తూ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.25 వేల చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. తమ కుటుంబ కష్టాలను తెలుసుకుని స్వయంగా పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన మంత్రి సుభాష్‌కు గోవిందు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), కూటమి పార్టీ నాయకులు రాయపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య (బాబు), జుత్తుక శ్యామ్ ప్రసాద్, వాసంశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

బుధవారం, 27 మే 2026
www.viswamvoice.com





# పసుపు పండుగకు నగరం సిద్ధం

## డిజిటల్ మహానాడుతో చరిత్ర సృష్టించనున్న టీడీపీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడుకు రాజమహేంద్రవరం నగరం సిద్ధమైంది. నగరంలోని హోటల్ జగదీశ్వరీలో సహా నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించనున్న డిజిటల్ మహానాడుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక సౌండ్ సిస్టమ్, ఇంటర్నెట్ కనెక్టివిటీ, కార్యకర్తల కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు, భోజన సదుపాయాలు తదితర అన్ని సమగ్రంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కేడర్‌తో హోటల్ జగదీశ్వరీలో నిర్వహించిన సమావేశానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పరిశీలకులు మెట్ల రమణబాబు హాజరై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. మహానాడు కార్యక్రమాలను ప్రతి కార్యకర్త గౌరవప్రదంగా, క్రమశిక్షణతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, అది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సంక్షేమ దిశను నిర్దేశించే మహా వేదిక అని పేర్కొన్నారు. పార్టీ స్థాపకులు నందమూరి తారకరామారావు ఆవిష్కరించిన ఆత్మగౌరవ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్తూ ప్రతి ఏడాది మహానాడు నిర్వహించడం పార్టీకి ఒక సంప్రదాయమని తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ డిజిటల్ వేదికపై మహానాడు నిర్వహించడం తెలుగుదేశం పార్టీ దూరదృష్టికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,848 క్లస్టర్లలో ఏకకాలంలో డిజిటల్ విధానంలో పార్టీ శ్రేణులను అనుసంధానిస్తూ ప్రతి కార్యకర్తను మహానాడు వేడుకల్లో భాగస్వామిని చేయడం విశేషమన్నారు. సాంకేతికతను కేవలం ప్రసంగాలకే పరిమితం చేయకుండా, దానిని గ్రామ స్థాయి కార్యకర్త వరకు తీసుకెళ్లి వినియోగంలోకి తీసుకురావడంలో తెలుగుదేశం పార్టీ దేశ రాజకీయాల్లోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించిందన్నారు. డిజిటల్ పాలన, పారదర్శక వ్యవస్థ, ఆధునిక కమ్యూనికేషన్ విధానాల అమలులో పార్టీ ఎప్పుడూ ముందంజలో ఉందని గుర్తుచేశారు. ఈ ఏడాది మహానాడు ప్రధాన థీమ్ "స్త్రీ శక్తి" కావడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. మహిళల రక్షణ, సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాధాన్యత, సామాజిక సాధికారతకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ఈ మహానాడు దేశానికి చాటి చెప్పబోతుందన్నారు. మహిళలను కుటుంబ పరిమితుల్లో కాకుండా నాయకత్వ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. సాంకేతికత మరియు మహిళా సాధికారత కలయికతో నిర్వహించబడుతున్న ఈ మహానాడు భవిష్యత్ రాజకీయాలకు కొత్త దిశానిర్దేశం చేయబోతుందని, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపబోతుందని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఖర్చుల నియంత్రణ, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో డిజిటల్ మహానాడు నిర్వహించడం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారీ స్థాయి సాంప్రదాయ సభల స్థానంలో డిజిటల్ అనుసంధానం ద్వారా సమయం, ఖర్చు, ఇంధన వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణ హిత విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు. డిజిటల్ మహానాడును విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని, పార్టీ పట్ల నిబద్ధతతో పాల్గొని పసుపు పండుగను ఘన విజయంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జ్ లు, నాయకులు పాల్గొన్నారు.

మహానాడుకు ప్రత్యేకంగా రెండు రోజుల ఆతిథ్య ఏర్పాట్లు

27వ తేదీ బుధవారం మెనూ :ఉదయం అల్పాహారం : ఇడ్లీ, మైసూర్ బజ్జి, తేనీరు

మధ్యాహ్న భోజనం :బ్రెడ్ హల్వా, ప్లెయిన్ బిర్యానీ, చికెన్ కర్రీ, ఎగ్ రోస్ట్, మిక్స్డ్ వెజిటబుల్ కర్రీ, వైట్ రైస్, సాంబార్, పాపడ్, పెరుగు, మామిడికాయ

28వ తేదీ గురువారం మెనూ :ఉదయం అల్పాహారం :ఉప్మా, మైసూర్ బజ్జి, తేనీరు

మధ్యాహ్న భోజనం : కేసరి, ప్లెయిన్ బిర్యానీ, చికెన్ కర్రీ, నెత్తళ్లతో ఎగ్ కర్రీ, ములక్కాడ జీడిపప్పు కర్రీ, వైట్ రైస్, సాంబార్, పాపడ్, పెరుగు, ఐస్‌క్రీమ్ అందిస్తున్నారు.

### 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు

# పిపిగా తుమ్మల వాసులక్ష్మి నియామకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (టెన్యూర్)గా న్యాయవాది తుమ్మల వాసులక్ష్మిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హోం (కోర్ట్స్-ఎ) శాఖ మంగళవారం విడుదల చేసిన జి.ఓ.ఆర్.టి నెం.656 ప్రకారం, ఆమెను మూడు సంవత్సరాల కాలానికి లేదా సేవల విరమణ వరకు, ఏది ముందుగా జరిగితే ఆ వరకు ఈ బాధ్యతల్లో కొనసాగించనున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తుమ్మల వాసులక్ష్మికి అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదిగా ఆమెకు ఉన్న అనుభవం, సేవాభావం ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో వాసులక్ష్మి నియామకం యువ న్యాయవాదులకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా కోర్టు వ్యవహారాల్లో ప్రభుత్వ తరఫున సమర్థవంతమైన వాదనలు వినిపిస్తూ న్యాయ పరిరక్షణకు కృషి చేస్తానని వాసులక్ష్మి తెలిపారు.

### ప్రజా సమస్యలపై ప్రభుత్వాలు

# తక్షణమే స్పందించాలి



### రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రభుత్వాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజల నుంచి వస్తున్న ఆవేదనలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, వాగులు, గెడ్డలు, పంట కాలువలు, జలాశయాలు, బఫర్ జోన్లు, గ్రీన్ బెల్టులు, వాటర్ పాసేజ్ మార్గాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వీకులు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన జల వనరులను కబ్జా చేసి మాయం చేస్తూ, మరోవైపు నీటి కొరతపై ఆందోళనలు వ్యక్తం చేయడం విచారకరమన్నారు. సహజ జలమార్గాలు నాశనం అయితే భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. స్త్రీశక్తి పథకం అమలు నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల నిర్వహణలో అనేక లోపాలు బయటపడుతున్నాయని మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. నిర్దేశిత బస్టాపుల్లో బస్సులు ఆగకపోవడం, వృద్ధులు, మహిళలు, రోగులు ఇబ్బందులు పడటం వంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. కాలం చెల్లిన పాత బస్సులను మరమ్మతులు చేయకపోవడం, కొత్త బస్సులను సమకూర్చడంలో నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి పథక అమలుపై సమీక్ష నిర్వహించి లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు పేరుకే నిర్వహిస్తున్నారని, ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. వాట్సాప్ గవర్నెన్స్, మన మిత్ర, పుర మిత్ర వంటి వ్యవస్థల ద్వారా ఫిర్యాదులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారంలో పారదర్శకత కనిపించడం లేదన్నారు. కొన్ని ఫిర్యాదులను సంబంధిత వ్యక్తులకు తెలియకుండానే ముగించేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో భూకబ్జాలు, నకిలీ పత్రాల సృష్టి, రికార్డుల మార్పులు విపరీతంగా పెరిగిపోయాయని మేడా శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అసలు హక్కుదారులనే భయభ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని, కొంతమంది అధికారులు కూడా ఈ వ్యవహారాల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. భూముల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులు, మహిళలు, బాలికలు, ఆస్తులు కూడబెట్టుకుని ప్రశాంత జీవితం గడపాలనుకునే ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ చెలరేగిపోతూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవించే హక్కు, భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# డిజిటల్ మహానాడు విజయవంతం చేయడానికి కృషి చెయ్యాలి

### రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** టీడీపీ ఆధ్వర్యంలో రేపు నిర్వహించనున్న డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్దాపురం నియోజకవర్గం లోని వివిధ క్లస్టర్లలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు , కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్, పెద్దాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె రామారావు విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దాపురం పట్టణంలోని మట్టి ఆదినారాయణ కళ్యాణ మండపంలో క్లస్టర్ నెంబర్ 4 , 5 మహానాడు కార్యక్రమ ఏర్పాట్లు, అంబేద్కర్ భవన్‌లో క్లస్టర్ నెంబర్ 1 కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా సామర్లకోట పట్టణంలోని యార్లగడ్డ సుబ్బారావు కళ్యాణ మండపం మరియు రైతు భవన్‌లలో క్లస్టర్ నెంబర్ 9 & 10 కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. వేట్లపాలెం గ్రామంలోని డొక్కా సీతమ్మ ఫంక్షన్ హాల్‌లో క్లస్టర్ నెంబర్ 6 మహానాడు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించగా, అచ్చంపేట గ్రామంలోని కాపు కళ్యాణ మండపంలో క్లస్టర్ నెంబర్ 7 కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానాడు తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని, పార్టీ ఆవిర్భావం నుంచి మహానాడు కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అయితే మరియు విద్యాశాఖ మంత్రి మరియు పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పార్టీ పెద్దలు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. క్లస్టర్ల వారీగా కార్యకర్తలు, టీడీపీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని పరిస్థితులను గమనిస్తూ ఉండాలని సూచించారు. సభా ప్రాంగణాల్లో కూర్చునే ఏర్పాట్లు, డిజిటల్ ప్రసార సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, ఎమర్జెన్సీ మెడికల్ కిట్, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత బాధ్యులకు సూచించారు.

# నగరంలో డివిజన్ కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు : బాలేపల్లి మురళీధర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని 49వ డివిజన్‌కు సంబంధించిన సమావేశం నిర్వహించి డివిజన్ కమిటీని ప్రకటించారు. డివిజన్ నాయకుడు బర్రె సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.కే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 49వ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా సాకా పెదబాబు, ఉపాధ్యక్షులుగా పప్పు నవీన్, జిగాటాల దావీదులను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శులుగా సాకా ప్రసాద్, వల్లూరి సూరిబాబులను నియమించడంతో పాటు ఏడుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, వైఎస్ షర్మిల సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా డివిజన్ కమిటీల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ రంగారావు, మోత శారద, జయలలిత, తాడి సూరిబాబు, నల్లా వీర్రాజు, డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, సత్యన్నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైంది

### పుష్కరాల రాజకీయాలు మానుకుని గోదావరిని రక్షించండి

### ప్రజల ప్రాణాలతో రాజకీయాలు ఆపాలని పీడీఎస్‌యూ డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పుష్కరాల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, చారిత్రక నగరమైన రాజమహేంద్రవరాన్ని కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచార కేంద్రంగా మార్చిందని విమర్శించారు. ఒకవైపు "పుష్కర స్నానం పుణ్యం" అంటూ కోట్ల రూపాయల ప్రచారం చేస్తూ, మరోవైపు గోదావరిలో పేపర్ మిల్స్ వ్యర్థాలు, డ్రైనేజ్ నీరు కలుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు గోదావరిలో స్నానం చేసి అనారోగ్యానికి గురైతే దానికి బాధ్యత నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. గోదావరిలో అక్రమ ఇసుక తవ్వకాలు, భారీ స్థాయిలో ఇసుక దోపిడీ జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఎస్. కిరణ్ కుమార్ ఆరోపించారు. ఇసుక మాఫియా కారణంగా గోదావరి అడుగు భాగం బలహీనపడుతోందని, భవిష్యత్తులో బ్రిడ్జిల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. పుష్కరాలు భక్తుల కోసంనా లేక కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసంనా అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రజల భద్రత కంటే పుష్కర కాంట్రాక్టులు, బిల్లుల రాజకీయాలపైనే అధికార పార్టీ దృష్టి ఉందని మండిపడ్డారు. గత పుష్కరాల్లో జరిగిన విషాదాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, ఈసారి కూడా నిర్లక్ష్యం కొనసాగితే ప్రజా ఆగ్రహం తీవ్ర రూపం దాలుస్తుందని హెచ్చరించారు. డ్రోన్ షోలు, ఫోటో సెషన్లు కాకుండా ప్రజల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్మికులను బానిసల్లా పని చేయిస్తున్నారని, ఒక్కో కార్మికుడికి మూడు పనులు అప్పగించడం అమానుషమని విమర్శించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే చేపట్టాల్సిన చర్యలను ఆయన వెల్లడించారు. గోదావరి పూర్తి స్థాయి శుద్ధి, అక్రమ ఇసుక మాఫియాపై సిట్ విచారణ, గోదావరి బ్రిడ్జిలకు సేఫ్టీ ఆడిట్, ప్రతి బోటుకు ఫిట్‌నెస్ మరియు లైఫ్ జాకెట్లు తప్పనిసరి చేయడం, పుష్కర ఘాట్ల వద్ద 24 గంటల వైద్య సేవలు ఏర్పాటు చేయడం, పుష్కర పనుల్లో కమిషన్లపై వైట్ పేపర్ విడుదల చేయాలని కోరారు.

# గొల్లపూంత కాలనీలో ఆపరేషన్ క్లీన్ స్వీప్

### పరిసరాల శుభ్రత లో భాగస్వాములైన కాలనీవాసులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గొల్లపుంత కాలనీలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనరు టీవీ రంగారావు ఆధ్వర్యంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది కాలనీలోని వీధులన్నిటిని శుభ్రపరిచారు. చెత్తకుప్పలను, రోడ్ల మార్జిన్లలో తుప్పలను, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. వారితోపాటు కాలనీవాసులంతా స్వచ్ఛందంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొని సహకారం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఈ కే శ్రీనివాస్, ఆర్వో మాచిరాజు రవి, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, ఏఈ ఆర్ అనూషలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు సచివాలయముల సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

### ప్రముఖ కంపెనీలలో

# వివిధ ఉద్యోగ అవకాశాలు

### 30న మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్.శిరీష తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి జిల్లా ఉపాధి కార్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ జాబ్ మేళా జరగనుంది. ప్రముఖ కంపెనీలలో వివిధ ఉద్యోగ అవకాశాల కోసం ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటా, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

### ఘనంగా వేగుళ్ళ కృష్ణ చైతన్య

# పుట్టినరోజు వేడుకలు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** యువ పారిశ్రామిక వేత్త, మండపేట వేగుళ్ళ సూర్యా రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లైబ్రరీ భవనాల నిర్మాణ దాత, మాధవి స్పోర్ట్స్ క్లబ్, మాధవి ఆయిల్స్ అధినేత వేగుళ్ళ సూర్య కృష్ణ చైతన్య పుట్టినరోజు వేడుకలు ఆయన మిత్రుడు వంక వర శేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విజ్ఞాన్ విద్యాసంస్థల వద్ద బాటసారులకు, వాహనదారులకు మండే ఎండ నుండి సేదతీర్చి వారి దాహార్తి తీర్చేందుకు ప్రతి సంవత్సరం వేసవికాలంలో విజ్ఞాన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే మజ్జిగ వితరణ కార్యక్రమం ప్రతి ఏడాది పుట్టినరోజు నాడు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందని వరప్రసాద్ పేర్కొన్నారు. విజ్ఞాన్ కాలేజీ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంక వర శేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు, ఎందరో విద్యార్థులకు వారి విద్యాభ్యాసానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే వల్లూరి సూర్య కృష్ణ చైతన్య (చైతుబాబు) నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయుడు రాంబాబు, పాలకేంద్రం బాబి, కూరసాలా సత్యనారాయణ, వేగుళ్ల చైతన్య బాబు మిత్రులు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

### 'మా ఇంటి బంగారం' ట్రైలర్ వచ్చేసింది..

# సమంతను ఇలా ఎప్పుడూ చూడలేదుగా..




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సినిమా మా ఇంటి బంగారం. లేడీ డైరెక్టర్ నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. జూన్ 19న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్లలో భాగంగా కాసేపటి క్రితమే ఈ మూవీ ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్.స్టార్ హీరోయిన్ సమంత నటిస్తూ, స్వయంగా నిర్మిస్తున్న సరికొత్త సినిమా 'మా ఇంటి బంగారం'. గతంలో సమంతతో ఓ బేబీ లాంటి బ్లాక్ బస్టర్ సినిమాను తెరకెక్కించిన నందిని రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా నుంచి ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, సాంగ్స్ కు అభిమానుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సోమవారం (మే 25) రాత్రి రిలీజ్ చేసిన ఈ ట్రైలర్ లో సమంత చాలా కొత్తగా కనిపించింది. ఒకవైపు అమాయకపు కోడలిగా, మరోవైపు గూండాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే అండర్ వరల్డ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న మహిళగా అదరగొట్టింది. 'నా ప్రాణం అడ్డుపెట్టైనా ..నా ఫ్యామిలీ కి ఏమి కాకుండా చూస్కుంటా' అని సామ్ నోట నుంచి వచ్చిన డైలాగులు సినిమాపై మరింత ఆసక్తిని క్రియేట్ చేస్తున్నాయి. కాగా మా ఇంటి బంగారం సినిమాను సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై నిర్మిస్తోంది. అలాగే సామ్ భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు ఈ చిత్రానికి కథను అందించడం విశేషం. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 19న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మాఇంటి బంగారం సినిమాలో సమంతతో పాటు దిగంత్, గుల్షన్ దేవయ్య, సీనియర్ నటి గౌతమి, మంజుషా, శ్రీముఖి తదితరులు కీలకపాత్రలు పోషించారు. సంతోష్ నారాయణన్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన తస్సాదియ్యా సాంగ్ యూట్యూబ్ లో ట్రెండింగ్‌లో ఉంది.

### అవకాశాలు లేక టాలీవుడ్‌కు

# దూరం అయిన అందాల సీరత్



అందాల భామ సీరత్ కపూర్.. ఈ బ్యూటీ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.. ఈ క్రేజీ భామ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యంగ్ హీరో శర్వానంద్ నటించిన సూపర్ హిట్ మూవీ రన్ రాజా రాజా రన్ సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది. అందాల భామ సీరత్ కపూర్.. ఈ బ్యూటీ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.. ఈ క్రేజీ భామ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యంగ్ హీరో శర్వానంద్ నటించిన సూపర్ హిట్ మూవీ రన్ రాజా రాజా రన్ సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది సీరత్ కపూర్. ఆ తర్వాత ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో మెప్పించింది. ఆతర్వాత తెలుగులో ఎక్కడా కనిపించలేదు ఈ చిన్నది. రన్ రాజా రన్ సినిమా తర్వాత కొన్ని సినిమాలు చేసింది..కానీ.. ఈ ముద్దుగుమ్మకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. దీంతో అవకాశాలు సైతం తగ్గిపోయాయి. అయితే ఈ హీరోయిన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ అయ్యింది. సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. 2015లో సందీప్ కిషన్ నటించిన టైగర్ చిత్రంలో నటించింది. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. ఇక ఆ తర్వాత కొలంబస్, రాజు గారి గది 2, టచ్ చేసి చూడు, ఒక్క క్షణం చిత్రాల్లో నటించింది. అయితే ఈ సినిమాలన్ని బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ కాగా.. అందంలో ఈ అమ్మడుకు మాత్రం మంచి క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత మరో సినిమాలో కనిపించలేదు. ఆమె చివరిసారిగా మా వింత గాధ వినుమా సినిమాలో నటించింది. అలాగే ఆమధ్య హిందీలో మారిచ్ అనే క్రైం థ్రిల్లర్ లో నటించింది. సీరత్ కపూర్ కేవలం నటి మాత్రమే కాదు.. మంచి డాన్సర్ కూడా.. తన డాన్స్ స్టెప్పులతో మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ. బాలీవుడ్ ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్ గా చేసింది సీరత్ కపూర్.. పలు సినిమాల్లో కొరియోగ్రాఫర్ గా చేసింది సీరత్. ఆ తర్వాత నటనపై ఆసక్తితో హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ గ్లామర్ ఫోటోస్ వైరలవుతున్నాయి.ఈ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. క్రేజీ కామెంట్స్ చేస్తూ హల్ చల్ చేస్తున్నారు నెటిజన్స్.

# ఆరెంజ్ vs పింక్ హ్యాట్రిక్ పోరుకు వేళాయే..



ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన నాకౌట్ దశకు చేరుకుంది. లీగ్ దశ ముగిసి ప్లేఆఫ్స్ సమరం మొదలైన వేళ, అభిమానుల్లో అసలైన నరాలు తెగే ఉత్కంఠ రేపుతోంది. మే 27న న్యూ చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమించక తప్పని ఈ చావో రేవో పోరుకు సంబంధించిన పూర్తి సమాచారం మీకోసం. ఇక తప్పులు చేయడానికి అస్సలు ఛాన్స్ లేదు. ఓడిపోతే లగేజ్ సర్దుకుని ఇంటికి వెళ్లడమే. ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఇప్పుడు ఎలిమినేటర్ పోరులో ముఖాముఖి తలపడేందుకు సిద్ధమయ్యాయి.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్: ఎలిమినేటర్ సమరం ఎప్పుడు?**

లీగ్ పట్టికలో మూడో స్థానంలో నిలిచిన పాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్, నాలుగో స్థానాన్ని దక్కించుకున్న రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ మధ్య ఈ హై-వోల్టేజ్ ఎలిమినేటర్ మ్యాచ్ మే 27, బుధవారం రాత్రి జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫైయర్ 2కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

మ్యాచ్ వేదిక, సమయం..

ఈ కీలక పోరుకు పంజాబ్‌లోని సరికొత్త మైదానం వేదిక కానుంది.

వేదిక: మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ముల్లన్‌పూర్ (న్యూ చండీగఢ్).

సమయం: బుధవారం రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. రాత్రి 7:00 గంటలకు టాస్ వేస్తారు.

**ఇరు జట్ల బలాబలాలు.. పైచేయి ఎవరిది..?**

ఈ సీజన్ లీగ్ దశలో రాజస్థాన్‌పై సన్‌రైజర్స్ పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ హైదరాబాద్ జట్టు విజయం సాధించడంతో మానసికంగా సన్‌రైజర్స్ బలంగా ఉంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వంటి విధ్వంసకర బ్యాటర్లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైన్ అప్ పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ ఫామ్‌లోకి రావడం రాజస్థాన్ రాయల్స్‌కు కలిసొచ్చే అంశం. అయితే, ముల్లన్‌పూర్ మైదానంలో రాజస్థాన్ జట్టుకు మంచి రికార్డు ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ విజయం సాధించడం విశేషం.

**ముల్లన్‌పూర్ పిచ్ రిపోర్ట్.. బౌలర్లకు చుక్కలేనా..?**

ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు వేదికైన మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ముల్లన్‌పూర్) బ్యాటింగ్‌కు స్వర్గధామంగా పేరుగాంచింది. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లలో బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చిన్న బౌండరీలు, వేగవంతమైన ఔట్‌ఫీల్డ్ కారణంగా బంతి క్షణాల్లో సరిహద్దులు దాటుతోంది. ఇప్పటికే ఈ మైదానంలో 220కి పైగా భారీ స్కోర్లు కూడా ఎంతో సులువుగా ఛేజ్ అయ్యాయి. మ్యాచ్ ప్రారంభంలో పేస్ బౌలర్లకు కాస్త స్వింగ్ లభించినప్పటికీ, సమయం గడిచేకొద్దీ పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుని, రాత్రి వేళ చేజింగ్ వైపు మొగ్గు చూపే అవకాశం స్పష్టంగా ఉంది.

**హెడ్-టు-హెడ్ రికార్డులు.. ఆరెంజ్ ఆర్మీదే పైచేయి..!**

ఐపీఎల్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య రికార్డులను పరిశీలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పష్టమైన ఆధిక్యంలో కనిపిస్తోంది. ఇరు జట్లు ఇప్పటివరకు 23 మ్యాచ్‌ల్లో ముఖాముఖి తలపడగా, అందులో సన్‌రైజర్స్ ఏకంగా 14 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్ కేవలం 9 మ్యాచ్‌ల్లో మాత్రమే గెలుపొందింది. అంతేకాదు, ఈ 2026 సీజన్ లీగ్ దశలో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ పాట్ కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ జట్టు రాజస్థాన్‌ను చిత్తు చేయడం విశేషం. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల తేడాతో, జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ ఘనవిజయం సాధించి మానసికంగా బలంగా ఉంది.

**ఇరు జట్ల బలాబలాలు.. కీలక ఆటగాళ్లు వీరే..!**

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ లతో పాటు ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ రూపంలో విధ్వంసకర బ్యాటింగ్ లైన్ అప్ ఉంది. ముఖ్యంగా క్లాసెన్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. బౌలింగ్‌లో ఇషాన్ మలింగ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ జట్టు 15 ఏళ్ల సంచలన కుర్రాడు వైభవ్ సూర్యవంశీపై భారీగా ఆశలు పెట్టుకుంది. జైపూర్‌లో హైదరాబాద్‌పై కేవలం 36 బంతుల్లోనే శతకం బాదిన సూర్యవంశీ ఈ మ్యాచ్‌లోనూ కీలకం కానున్నాడు. అతనికి తోడుగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ లతో రాజస్థాన్ బ్యాటింగ్ బలంగా ఉంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలో వికెట్లు తీయడంపైనే రాజస్థాన్ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

**రెండు జట్ల అంచనా తుది జట్లు (ప్లేయింగ్ 11):**

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, లియామ్ లివింగ్‌స్టోన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), ఇషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్, శివాంగ్ కుమార్, జీషన్ అన్సారీ.

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), షిమ్రాన్ హెట్‌మైర్, రవీంద్ర జడేజా, డోనోవన్ ఫెరీరా, జోఫ్రా ఆర్చర్, బ్రిజేష్ శర్మ, నాంద్రే బర్గర్, యష్ రాజ్ పుంజా.

సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుకు, రాజస్థాన్ రాయల్స్ వ్యూహాత్మక ఆటతీరుకు మధ్య జరగబోయే ఈ పోరు క్రికెట్ ప్రేమికులకు కంటిమీద కునుకు లేకుండా చేయడం ఖాయం. పంజాబ్ పిచ్‌పై మొదట్లో పేసర్లకు స్వింగ్ లభించే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. మరి రేపు హైదరాబాద్ కేక పెడుతుందో, రాజస్థాన్ రాయల్స్ ప్రతీకారం తీర్చుకుంటుందో చూడాలి!

### ఫైనల్ బెర్త్ కోసం

# ఆర్సీబీ vs జీటీ వార్..

### టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న గుజరాత్



ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకుంది. ఆర్సీబీ, జీటీ మధ్య ధర్మశాల వేదిక గా జరుగుతున్న ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు వచ్చేసింది. ధర్మశాల వేదికగా జరుగుతున్న తొలి క్వాలిఫైయర్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. మంచు ప్రభావం ఉండే అవకాశం ఉండటంతో ఛేజింగ్‌కే మొగ్గు చూపాడు గిల్. లీగ్ దశలో ఆర్సీబీ, గుజరాత్ రెండు జట్లు కూడా తలో 18 పాయింట్లు సాధించి సత్తా చాటాయి. అయితే, మెరుగైన నెట్ రన్ రేట్ ఉండటంతో రజత్ పాటిదార్ సేన టేబుల్ టాపర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఓడిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది (క్వాలిఫైయర్-2 ఆడాల్సి ఉంటుంది). ఈ సీజన్‌లో ఇప్పటికే రెండుసార్లు తలపడగా, రెండు జట్లు చెరో మ్యాచ్ గెలిచి సమానంగా ఉన్నాయి. దీంతో ఈ మూడో పోరులో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆర్సీబీకి విరాట్ కోహ్లీ అనుభవం కొండంత అండగా నిలుస్తోంది. కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా సూపర్ ఫామ్‌లో ఉండి ఆర్సీబీ 200 పైచిలుకు స్కోర్లను అలవోకగా బాదేస్తోంది. మరోవైపు గుజరాత్ టీమ్‌లో శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ వంటి స్టార్ బ్యాటర్లు ఉన్నారు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ బ్యాటర్లు.. గుజరాత్ పేసర్లయిన సిరాజ్, రబడాలను ఎలా ఎదుర్కొంటారనేది కీలకం కానుంది. అలాగే ఆర్సీబీ పేసర్ భువనేశ్వర్ కుమార్ (పర్పుల్ క్యాప్ హోల్డర్) స్పెల్ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ధర్మశాల పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. పైగా బౌండరీలు చిన్నవి కావడంతో 220-250 పరుగులు చేసినా సేఫ్ కాదని ఆర్సీబీ కెప్టెన్ పాటిదార్ అభిప్రాయపడ్డారు. గాయం నుంచి కోలుకున్న ఫిలిప్ సాల్ట్ ఆర్సీబీ జట్టులోకి రావడం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. అటు రషీద్ ఖాన్ మాయాజాలాన్ని అడ్డుకోవడం ఆర్సీబీ మిడిల్ ఆర్డర్‌కు పెద్ద సవాలే. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న గుజరాత్‌కు.. భారీ స్కోరు లక్ష్యంగా ఆర్సీబీ బ్యాటర్లు రెడీ అవుతున్నారు.

**గుజరాత్ టైటాన్స్ ప్లేయింగ్ 11 :** సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, నిషాంత్ సింధు, జాసన్ హోల్డర్, రషీద్ ఖాన్, కుల్వంత్ ఖేజ్రోలియా, కగిసో రబడ, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేయింగ్ 11 :** వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లి, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, జోష్ హాజిల్‌వుడ్, రసిఖ్ సలాం దార్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com